www.flashindianews.com

FLASH INDIA NEWS

ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 150 | శుక్రవారం 17.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



# భక్తజన సందోహంగా గోల్కొండ

## జగదాంబిక ఆలయానికి రూ.11 లక్షల ప్రభుత్వ ఆర్థిక సహాయం

**జగదాంబికకు తొలి బోనం బోనాల సందడి మొదలైంది**

ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు.

- గోల్కొండలో తొలి బోనంతో ఆషాడ బోనాల ప్రారంభం
- జగదాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకున్న మంత్రి సురేఖ
- బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం
- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఎజెండా
- డప్పు, పోతురాజుల విన్యాసాలతో సందడిగా బోనాల వేడుకలు

02



# ఇక వెనక్కి తగ్గేది లేదు..

## సీతారామ ప్రాజెక్టుపై క్షేత్రస్థాయి సమీక్ష



### జిల్లా రైతుల సాగునీటి కల సాకారం చేస్తాం

**ప్రజాధనం వృథా కాకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తాం**

**సీతారామ ప్రాజెక్టుపై క్షేత్రస్థాయి సమీక్ష**

- గోదావరి జలాల గరిష్ట వినియోగంపై ప్రజా ప్రభుత్వ దృష్టి
- సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు
- చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే లక్ష్యం
- వైఎస్ హయాంలో ప్రారంభమైన ప్రాజెక్టుల ప్రస్తావన
- రీడిజైన్‌తో ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందన్న భట్టి
- ప్రజాధనం వృథా కాకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల పూర్తి పట్ల ప్రభుత్వ కట్టుబాటు

03

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గోదావరి నదిలో ప్రవహించే జలాలను గురుత్వాకర్షణ (గ్రావిటీ), ఎత్తి పోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పద్ధతుల ద్వారా గరిష్ట స్థాయిలో వినియోగించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి క్షేత్ర-స్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.


# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి




- మేడారం మహాజాతరకు వేగంగా ఏర్పాట్లు
- భక్తులకు మెరుగైన సౌకర్యాలపై దృష్టి
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు
- రోడ్ల విస్తరణకు మంత్రి సీతక్క ఆదేశాలు
- ట్రాఫిక్ సమస్యల నివారణకు కార్యాచరణ
- సమ్మక్క-సారలమ్మకు ప్రత్యేక పూజలు
- వనమహోత్సవంలో మొక్కలు నాటిన మంత్రి
- క్యూ లైన్ల ఆధునికీకరణకు చర్యలు
- జంపన్న వాగు సుందరీకరణకు ప్రణాళిక

02

# అద్దెకుండే వారికి అడ్వాన్సుల భారం..



- మెట్రో నగరాల్లో అద్దెదారులపై సెక్యూరిటీ డిపాజిట్ల భారం
- టాప్-6 నగరాల్లో రూ.1.26 లక్షల కోట్లు డిపాజిట్లలో లాక్
- హైదరాబాద్‌లో సెక్యూరిటీ డిపాజిట్లుగా రూ.6,843 కోట్లు
- అద్దె కోసం నెలవారీ ఆదాయంలో 30 శాతానికి పైగా ఖర్చు
- అధిక డిపాజిట్లతో ఇళ్ల మార్పు కష్టమంటున్న అద్దెదారులు
- ఇల్లు కొనడం కంటే అద్దె జీవనమే భారంగా మారింది
- ఈఎంఐ-అద్దె వ్యత్యాసం మరింత పెరిగినట్లు అధ్యయనం
- జెన్‌జీ అద్దెదారులు తరచూ ఇళ్లు మారుతున్న ధోరణి

02

# కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే విద్యుత్ కోతలు

## పీపీటీలు పెట్టి హెచ్చరించినా మేల్కోలేదు

**కరెంట్ కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు**

**అడ్డగోలు ధరలకు ఎందుకు కొంటున్నారు?**

- అప్రకటిత కరెంట్ కోతలపై హరీశ్ రావు ఫైర్
- ప్రణాళికా లోపంతో తెలంగాణ అంధకారంలోకి
- కరెంట్ కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు
- బొగ్గు కొరతతో విద్యుత్ ఉత్పత్తి దెబ్బ
- ప్రభుత్వ వైఫల్యమే విద్యుత్ సంక్షోభానికి కారణం
- 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి
- థర్మల్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు ఆందోళనకరం
- పవర్ ఎక్స్ఛేంజ్‌లో అధిక ధరలకు కొనుగోళ్లు

03





# భక్తజన సందోహంగా గోల్కొండ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ గారు, పొన్నం ప్రభాకర్ గారు గోల్కొండ జగదాంబిక అమ్మవారి దయతో ఎల్ నినో ప్రభావం తగ్గి, వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన ఎజెండా పనిచేస్తున్నదన్న మంత్రి సురేఖ గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరఫున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# అద్దెకుండే వారికి అడ్వాన్సుల భారం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఇండ్లు అద్దెకు తీసుకునే వారిపై సెక్యూరిటీ డిపాజిట్ల భారం భారీగా పడుతోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై, పుణె వంటి టాప్ 6 మెట్రో నగరాల్లో అద్దెదారులు ఇళ్ల యజమానుల వద్ద ఏకంగా రూ. 1.26 లక్షల కోట్లను సెక్యూరిటీ డిపాజిట్ల రూపంలో దాచారని ప్రముఖ రియల్ ఎస్టేట్ ప్లాట్‌ఫామ్ 'నోబ్రోకర్' తన అధ్యయనంలో వెల్లడైంది. ఈ అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి.

**హైదరాబాద్ లో రూ.6,843 కోట్లు:**

సర్వే చేసిన నగరాల్లో ముంబయిలో అత్యధికంగా రూ. 41,156 కోట్లు, బెంగళూరులో రూ. 31,628 కోట్లు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రూ.24,054 కోట్లు, చెన్నైలో రూ.17,346 కోట్లు, హైదరాబాద్‌లో రూ.6,843 కోట్లు, పుణేలో రూ.5,015 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్ల రూపంలో లాక్ అయి ఉన్నాయని తేలింది. అధిక సెక్యూరిటీ డిపాజిట్ల కారణంగానే తాము ఇష్టపడిన ఇళ్లల్లోకి మారలేకపోయామని బెంగళూరులోని 75 శాతం మంది అద్దెదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ లో 58 శాతం మంది అద్దెదారులకు లీజ్ ముగిసిన తర్వాత డిపాజిట్ సొమ్ము పూర్తిగా తిరిగి రాగా, 30 శాతం మందికి కొన్ని కటింగ్‌లు జరిగాయని తమ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే అద్దెదారుల నెలవారీ బడ్జెట్‌లో అద్దె అనేది అతిపెద్ద ఖర్చుగా మారిందని ఈ అధ్యయనం తేల్చింది. దాదాపు సగం మంది అద్దెదారులు తమ నెలవారీ ఆదాయంలో 30 శాతానికి పైగా అద్దెలకే ఖర్చు చేస్తున్నారని, ముఖ్యంగా ముంబయిలో 25 శాతం మంది అద్దెదారులు తమ సంపాదనలో సగానికి పైగా (50% పైగా) అద్దెకే కేటాయిస్తుండగా.. మరో 15 శాతం మంది 41-50 శాతం లోపు చెల్లిస్తున్నట్లు తేలింది.

**ఇల్లు కొనడం మరింత కష్టంగా:**

ఇల్లు కొనడం కంటే అద్దెకు ఉండటమే నగరవాసులకు ఆర్థికంగా భారంగా మారిందని దీంతో సొంతింటి కల అందని ద్రాక్షలా మారిందని ఈ అధ్యయన నివేదిక పేర్కొంది. 2021 నుండి అద్దెకు, ఈఎంఐకి మధ్య ఉన్న వ్యత్యాసం సైతం మరింత పెరిగిందని స్పష్టం చేసింది. బెంగళూరులో ఈఎంఐ-అద్దె నిష్పత్తి 2.07 నుంచి 2.38కు, హైదరాబాద్‌లో 2.21 నుంచి 2.47కు, ముంబైలో 2.03 నుంచి 2.19కు పెరిగింది. దీంతో ఇల్లు కొనాలనుకునే వారు కూడా తప్పనిసరిగా అద్దె ఇళ్లలోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంది.

**మారుతున్న అద్దెదారులు ధోరణి జెన్ జీ ట్రెండ్:**

పాత తరంతో పోలిస్తే 'జెన్ జీ' అద్దెదారులు చాలా వేగంగా ఇళ్లను మారుస్తున్నట్లు ఈ అధ్యయనం గుర్తించింది. 18-24 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 30 శాతం మంది ప్రతి 6 నుండి 12 నెలలకోసారి ఇళ్లు మారుతున్నారని, 35 ఏళ్లు దాటిన వారిలో ఈ సంఖ్య 10 శాతం మాత్రమే ఉన్నారని, ఇక 55 ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువ మంది మూడు సంవత్సరాలకు పైగా ఒకే ఇంటిలో నివసిస్తున్నట్లు పేర్కొంది.

**చిన్న ఇళ్లకే ఎక్కువ లాభం:**

పెట్టుబడిదారుల కోణంలో చూస్తే.. పెద్ద ఇళ్ల కంటే 1BHK, స్టూడియో రూమ్‌ల వంటి చిన్న ఇళ్లే ఎక్కువ అద్దె రాబడిని అందిస్తున్నట్లు స్పష్టమైంది. ఇళ్ల పరిమాణం పెరిగే కొద్దీ ఈ రాబడి తగ్గుతోందని ఎక్కువ నగరాల్లో 4BHK ఇళ్లకు 3 శాతం కంటే తక్కువ రాబడి మాత్రమే లభిస్తున్నట్లు అధ్యయనం వెల్లడించింది. అద్దె రాబడిలో బెంగళూరు 4.8 శాతం, హైదరాబాద్ 4.6 శాతంతో అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపింది.

# వైఎస్ఆర్ హయాంలో ప్రాజెక్టుల అవినీతి


**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అవినీతి, దోపిడీకి గురై కూనరిల్లిన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుగా పునర్జీవం పోసి ప్రగతి పథంలో నడిపించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని జలయజ్ఞం అని ధనయజ్ఞంగా మార్చి మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట దోపిడీ చేసి ప్రాజెక్టులను అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మార్చిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి గోదావరి జలాలను ఒడిసిపట్టి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9 వేల కోట్లు వెచ్చించి, 100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించామని, అధిక సామర్థ్యం గల మోటార్లు, ఆధునిక యంత్ర పరికరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని 90 శాతం వరకు పూర్తి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగానికి సాగర్ ఆయకట్టుకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడం, వ్యవసాయాభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును రూపుదిద్దారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు సీతారామ ప్రాజెక్టుకు తాము ఎంత మేర నిధులు ఖర్చు చేశారో చేసిన కృషి ఏమీ లేక ప్రజలకు చెప్పుకునే విషయాలు లేకపోవడంతో కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులనే తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం కాంగ్రెస్ మంత్రులు చేయడం ప్రజలను మోసం చేయడమేనని ఎవరి కృషి ఏమిటో వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా తెలుసని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**ములుగు,ఫ్లాష్ ఇండియా :** వచ్చే మేడారం మహాజాతరకు విచ్చేసే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. అలాగే మహాజాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్ల విస్తరణకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. గురువారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క--సారలమ్మ వనదేవతలను కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. తర్వాత మేడారం హరిత హోటల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్యూ లైన్లను ఆధునికీకరించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జంపన్న వాగు పరిసరాలను సుందరీకరించాలని, ప్రధాన రహదారుల ఇరువైపులా డివైడర్ల మధ్య పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని మంత్రి ఆదేశించారు. ఆలయ పరిసరాలతో పాటు మొత్తం మేడారం ప్రాంతాన్ని పారిశుధ్య కార్మికుల ద్వారా నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, రహదారులపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనలను రక్షిస్తుందనే భావనతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. మేడారం అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశించిన గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతల దర్శనం, జిల్లా అభివృద్ధి పైలాన్ ప్రారంభోత్సవం, నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు, ఆలయ పూజారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రైసైకిల్‌పై హెల్మెట్..

**తంగళ్లపల్లి,ఫ్లాష్ ఇండియా :** రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు అధికారులు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది వాహనదారుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. అయితే తంగళ్లపల్లిలో కనిపించిన ఓ దృశ్యం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ఓ దివ్యాంగుడు ట్రైసైకిల్‌పై ప్రయాణిస్తూ తనకు తప్పనిసరి కాకపోయినా భద్రత కోసం హెల్మెట్ ధరించాడు. అదే సమయంలో పక్కనే బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు మాత్రం చట్టప్రకారం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండానే ప్రయాణించడం కనిపించింది. ఈ దృశ్యం రోడ్డు భద్రత విషయంలో బాధ్యత ఎవరిది అనే ప్రశ్నను ముందుకు తెచ్చింది. శారీరక వైకల్యం ఉన్నప్పటికీ తన భద్రతను ముందుగా భావించి హెల్మెట్ ధరించిన దివ్యాంగుడు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాడు. "వైకల్యం శరీరానికే..బాధ్యతాయుతమైన ఆలోచన మనసుకు సంబంధించినది" అనే సందేశాన్ని ఈ ఘటన స్పష్టంగా చాటుతోంది. ట్రాఫిక్ నిబంధనలు శిక్షల భయంతో కాకుండా ప్రాణాల భద్రత కోసం పాటించాలనే విషయాన్ని ఈ దృశ్యం మరోసారి గుర్తు చేసింది.






ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రైతులకు మంత్రి సీతక్క సూచన



**ములుగు,ఫ్లాష్ ఇండియా :** అడవులతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ప్రతి ఒక్కరు అడవిని కాపాడుకొని సహజ సిద్ధమైన పండ్లు ఫలాలను తీసుకొని ఆరోగ్యకరంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పాత కాలపు నాటి అలవాట్లు నేడు బంగారంతో సమానమని అన్నారు. గురువారం తాడ్వాయి మండలం గొనెపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ వో వికాస్ మీనా, ఐటీడీఏ పీవో నవీన్ వత్సల్ టొప్పోలతో కలిసి గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా హంబుల్ బీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలకు చెందిన మహిళలకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పపువ్వు, సహజ సిద్ధమైన తేనె, మోదిగాకులు మానవ ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని, నేడు ప్లాస్టిక్ ప్లేట్లలో ఆహారం తీసుకోవడం వలన క్యాన్సర్ బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మోదిగాకులో ఆహారం తీసుకోవడం వలన ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని, అడవులలో దొరికే పండ్లు, ఆకులు పలు రకాల వ్యాధులకు పని చేస్తా-యని వివరించారు. మహిళా సంఘాలలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వ వడ్డీ లేని పది లక్షల రూపాయల రుణాలను అందజేస్తుందని, రుణాలు పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. గత కొద్ది నెలల క్రితం ఎస్ఎస్ తాడువాయి మండలం కొండపర్తి గ్రామంలో 50 వేల రూపాయలతో ఇప్పపువ్వు లడ్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా నేడు మహిళా సంఘాల సభ్యురాలు ఐదు లక్షల రూపాయల వరకు ఆదాయం పొందారని తెలిపారు. నేడు తేనెటీగల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు హంబుల్ బీ సంస్థ ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థిత-ుల్లో రైతులు వరి ధాన్యం కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని, కందులు, పెసర్లు, మొక్కజొన్న, తల్లి లాంటి పంటలు వేసుకోవాలని ఆయా పంటలకు రానున్న రోజుల్లో అధిక డిమాండ్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు,స్వయం సహాయక సంఘాల మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ

**అల్వాల్,ఫ్లాష్ ఇండియా :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యల పరిష్కారం, జలమండలిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి (ఐఏఎస్)ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జలమండలిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఒకే విధమైన పనులు, ఒకే బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ వేర్వేరు కేటగిరీల పేర్లతో అసమాన వేతనాలు చెల్లించడం సరికాదని పేర్కొన్నారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో మ-రణించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదు-ర్కోకుండా మానవతా దృక్పథంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. అలాగే కౌకూర్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటర్ ట్రయల్ రన్ నిర్వహించి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మచ్చబొల్లారం పరిధిలోని ఏడు కాలనీలకు భూగర్భ డ్రైనేజీ ట్రంక్ మెయిన్ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభించేందుకు సహకరించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జేసీ వెంకన్న, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇక వెనక్కి తగ్గేది లేదు..

**భద్రాద్రి కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గోదావరి నదిలో ప్రవహించే జలాలను గురుత్వాకర్షణ (గ్రావిటీ), ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పద్ధతుల ద్వారా గరిష్ట స్థాయిలో వినియోగించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి క్షేత్ర-స్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వాతావరణ మార్పులు, ప్రతికూల పరిస్థితుల వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వేగంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. మూడు రోజుల క్రితం దేవాదుల ఎత్తిపోతల పథకంలోని సమ్మక్క బ్యారేజ్ బ్యాక్‌వాటర్స్ వద్ద అన్ని పంపులను పూర్తిస్థాయిలో ప్రారంభించి, సుమారు 12 జిల్లాలు, 17 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 22 రిజర్వాయర్లను నింపే కార్యక్రమాన్ని స్వ-యంగా పర్యవేక్షించినట్లు గుర్తుచేశారు. ఈరోజు సీతారామ ప్రాజెక్టును కూడా పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గోదావరి నదిపై నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో జిల్లాలోని రైతులకు గోదావరి జలాలు అందించాలనే లక్ష్యంతో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రూపకల్పన చేశారని, ఈ ప్రాంతం నుంచే వాటి పనులు ప్రారంభమైన విషయాన్ని గుర్తు చేశారు. దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ ప్రాజెక్టును రూ.1,681 కోట్ల అంచనా వ్యయంతో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారని తెలిపారు. అలాగే గోదావరి, శబరి నదుల సంగమ ప్రాంతమైన రుద్రంకోట వద్ద ఇందిరా సాగర్ ఎత్తిపోతల పథకాన్ని రూ.1,824 కోట్ల వ్యయంతో మరో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రారంభించారని చెప్పారు. ఈ రెండు ప్రా-జెక్టుల ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,505 కోట్లతో ప్రణాళిక రూపొందించిందని వివరించారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై దాదాపు రూ.2,000 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. మిగిలిన రూ.1,505 కోట్లతో ప్రాజెక్టులను పూర్తి చేసి 4 లక్షల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి కేసీఆర్ ప్రభుత్వం దురుద్దేశంతో వీటిని రీడిజైన్ చేసిందని ఆరోపించారు. రీడిజైన్ కారణంగా సీతమ్మసాగర్ బ్యారేజీని కూడా కలుపుతూ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, అదనంగా రూ.7,500 నుంచి రూ.8,000 కోట్ల వరకు భారమైందని పేర్కొన్నారు. ఆ సమ-యంలో తాను ప్రచార కమిటీ ఛైర్మన్‌గా, ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఈ భారీ వ్యయాన్ని, అవినీతిని ప్రజల్లోనూ, సభల్లోనూ ఆధారాలతో ఎండగట్టామని తెలిపారు. అసలు రెండు ప్రాజెక్టులనే పూర్తి చేయాలని పలుమార్లు కోరినా, కేసీఆర్ ప్రభుత్వం మొండిగా రీడిజైన్‌ను కొనసాగించిందన్నారు. గత ప్రభుత్వ అక్రమాలను గమనించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొ-త్తం మంత్రివర్గం ఈ ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష నిర్వహించిందని తెలిపారు. ఇప్పటికే భారీగా ప్రజాధనం ఖర్చు అయినందున ప్రాజెక్టును నిలిపివేయడం సమంజసం కాదని భావించి, కొనసాగించి పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల లేమి, రిజర్వాయర్ల నిల్వ సామ-ర్థ్యం వంటి లోపాలను సరిచేస్తున్నామని చెప్పారు. రాజీవ్ కాలువను సాగర్ కాలువతో అనుసంధానం చేయడంతో పాటు, లింక్ కాలువలు, సొరంగ మార్గాల ద్వారా వైరా, పాలేరు రిజర్వాయర్లను నింపే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సత్తుపల్లి వరకు నీటిని అందించేందుకు పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. ఈ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసేందుకు నెలవారీ కార్యాచరణ రూపొందించి, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. "ఇది ప్రజా ప్రభుత్వం. ప్రజల సొమ్ములో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా చూస్తాం. ఇప్పటికే చేపట్టిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గోదావరి నదికి చివరి భాగంలో ఉన్న ఈ సీతారామ ప్రా-జెక్టు ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని వినియోగించి, జిల్లా రైతుల చిరకాల సాగునీటి కలను సాకారం చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే విద్యుత్ కోతలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం వల్లే తెలంగాణ అంధకారంలోకి నెట్టబడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో అప్రకటిత కరెంట్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలో బీఆర్ఎస్ హయాంలో కరెంట్ పోతే వార్తగా ఉండేదని, కానీ నేడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఉంటేనే వార్త అన్నట్లుగా పరిస్థితి మారిపోయిందని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**పీపీటీలు పెట్టి హెచ్చరించినా మేల్కోలేదు:**

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఈరోజు రాష్ట్రంలోని 11 జిల్లాల్లో సబ్‌స్టేషన్ల ముందు రైతాంగం ధర్నాలు చేపట్టిందన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్లే కరెంట్ కోతలు వస్తున్నాయని హరీశ్ రావు అన్నారు. సింగరేణి బొగ్గు నిల్వలపై తాము ముందే పీపీటీలు పెట్టి హెచ్చరించినా ప్రభుత్వం నిద్రలేవలేదన్నారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్‌లలో కేవలం 6 నుంచి 7 రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవని ఆరోపించారు. యాదాద్రి ప్లాంట్‌లో యూనిట్-1, యూనిట్-4లో బొగ్గు లేక ఉత్పత్తి నిలిచిపోగా, భద్రాద్రి ప్లాంట్‌లో నిర్వహణ వైఫల్యంతో ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. అసలు విద్యుత్ కోతలు ఎందుకు వస్తున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని, రాష్ట్రంలో లోడ్ కేవలం 15 వేల మెగావాట్లు మాత్రమే ఉందని7,180 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి జరగడం లేదన్నారు. నిన్న కేవలం 3,190 మెగావాట్ల సామర్థ్యం మేర ఉత్పత్తి జరిగిందని ఉన్న సామర్థ్యంలో కేవలం 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని ఆరోపించారు.

**అడ్డగోలు ధరలకు ఎందుకు కొంటున్నారు?:**

బొగ్గు సరఫరాలో, నీటి నిల్వల నిర్వహణలో, విద్యుత్ కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. బొగ్గు, పవర్, సాండ్, ల్యాండ్ ఇలా కాంగ్రెస్ పాలన అంతా స్కాముల మయంగా మారిందని ధ-్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గి సరఫరా తగ్గిందని అందుకే రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు పెడుతున్నారన్నారు. నీటిని లిఫ్ట్ చేసి రిజర్వాయర్లలో నీళ్లు నింపలేదు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని కూడా అసాధ్యం చేశా-రన్నారు. ముందస్తు ఆలోచనతో అయినా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సజావుగా జరిగేలా చూడలేదని. అడ్డగోలు ధరలకు 80 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పవర్ ఎక్స్ఛేంజ్‌లో కొనుగోలు చేస్తున్నారని ఆ భారం వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు ఎందుకు భరించాలని ప్రశ్నించారు.

**సింగరేణి వెబ్‌సైట్ మూసివేసి ఉత్పత్తి:**

సింగరేణి వెబ్‌సైట్ మూసివేసి ఉత్పత్తి, సరఫరా, బొగ్గు నాణ్యత వివరాలు బయటకు రాకుండా చేశారు. నాణ్యమైన సింగరేణి బొగ్గును తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు పంపుతున్నారు. తెలంగాణకు మాత్రం లో-క్వాలిటీ బొగ్గు పంపిస్తున్నారని ఆరోపించారు. 70 రేకులు పంపితే 30 రేకులు రిజెక్ట్ అవుతున్నాయి. అందుకే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి జరగడం లేదన్నారు. రాష్ట్ర అవసరాలు, రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎందుకు పంపిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలన్నారు. మీ దగ్గర బొగ్గు ఉండి కూడా అడ్డగోలు ధరలకు పవర్ ఎక్స్ఛేంజ్‌లో విద్యుత్ ఎందుకు కొనుగోలు చేస్తున్నారు? ఎందుకు కేవలం 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. త్రీ ఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా పొలం వద్ద జాగారం చేయాల్సి వస్తోందన్నారు. మీది కోతల సర్కార్... వాతల సర్కార్ అన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస-్తున్నాం. లేకపోతే రాష్ట్ర రైతాంగం తరపున బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు.

# కల్వకుర్తి ఎమ్మెల్యే పై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆచారి

తలకొండపల్లి మండల కేంద్రంలోని వివిధ గ్రామాల లింకు రోడ్లను పట్టించుకోని ఎమ్మెల్యే అని తెలిపారు.

జూలపల్లి గ్రామ ప్రజలకు రేషన్ బియ్యం రాకపోవడం బాధాకరం రేషన్ బియ్యం జూలపల్లి కి రాకపోతే తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక





**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నరేంద్ర మోడీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని,(సర్) ప్రక్రియలో భాగంగా తలకొండపల్లి మండల కేంద్రం లోని వివిధ గ్రామాలలో పర్యటించిన జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, అనంతరం

ఆయన. మాట్లాడుతూ...తలకొండపల్లి మండలంలోని లింకు రోడ్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంపై జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి మండిపడ్డారు. కల్వకుర్తి ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తూ, ఇతర పార్టీల సర్పంచులు తమ పార్టీలోకి మారితేనే నిధులు ఇస్తామనడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని అబద్ధాలు చెప్పడం మానుకోవాలని,ఎమ్మెల్యే తక్షణమే తన పద్ధతి మార్చుకోవాలని ఆచారి హెచ్చరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే వైఖరిపై ఆచారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తలకొండపల్లి గ్రామాల అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి స్పష్టం చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ (జిరాంజి) పథకం నిధులతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను ఎమ్మెల్యే తన ఇష్టానుసారంగా సొంత వ్యక్తులకు ఇస్తామనడం పద్ధతి కాదు. పక్షపాత రాజకీయం: ఇతర పార్టీల సర్పంచులు కాంగ్రెస్ లోకి మారితేనే నిధులు ఇస్తామనడం సిగ్గుచేటు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పై. ఆరోపణలు వస్తున్నాయన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ కి వెళ్లి బీజేపీ మంత్రుల నుంచి నిధులు తెస్తున్నారు. అయినప్పటికీ, పార్టీ మారితేనే నిధులు ఇస్తామని బీజేపీ కేంద్ర మంత్రులు ఎప్పుడూ అనడం లేదు. కల్వకుర్తి ఎమ్మెల్యే తక్షణమే తన ఏకపక్ష ధోరణిని మార్చుకోవాలి. తలకొండపల్లి మండల కేంద్రంలోని గట్టు ఇప్పలపల్లి,మెదక్ పల్లి,రాంపూర్, చంద్రధన,జూలపల్లి గ్రామాల బీటీ రోడ్లు ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న రోడ్డుపై ప్రయాణికులు ప్రమాదాల బారిన పడి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల లోని రోడ్ల అభివృద్ధిపై ఏమాత్రం పట్టించుకోని ఎమ్మెల్యే,అలాగే కడ్తాల్ నుండి తలకొండపల్లి ఎక్స్ రోడ్డు వరకు మధ్యలో ఉన్న ఫారెస్ట్ లో ఉన్న శిథిలమైన రోడ్డును అభివృద్ధి చేయకపోవడం ఎమ్మెల్యే పనికి నిదర్శనం. ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ... జూలపల్లి సర్పంచ్ కదారి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జూలపల్లి గ్రామం నుండి గట్టు ఇప్పలపల్లి గ్రామం వరకు పాదయాత్ర చేసి తలకొండపల్లి తాసిల్దార్ ఆఫీస్ ముట్టడిస్తామని తల్లోజు ఆచారి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. .కల్వకుర్తి ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఇతర పార్టీల సర్పంచులను నాయకులను పార్టీ మాడితేనే అభివృద్ధికి సహకరిస్తానని పరోక్షంగా తెలపడం సమంజసం కాదు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో ఈ మధ్యకాలంలో రేషన్ దుకాణంలో బహిరంగంగా బియ్యం అమ్ముతున్న రేషన్ డీలర్ ను గ్రామస్తులు పట్టుకొని చట్టబద్ధంగా పోలీసులకు పట్టించడం జరిగింది. ఆ కేసు కొనసాగుతుండగా..వేరే వ్యక్తులకు ఆ డీలర్ ఇవ్వకుండా ప్రజలకు బియ్యం రాకుండా చేస్తున్న మండల అధికారులు,నాయకుల నిర్లక్ష్యంతో ఈనెల జూలపల్లి ప్రజలకు రేషన్ బియ్యం రావడంలేదని జూలపల్లి సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజులో గ్రామానికి రేషన్ బియ్యం రాకపోతే మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సర్పంచ్ శేఖర్ యాదవ్ తెలిపారు. ఆచారి మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఇతర పార్టీల సర్పంచులను నాయకులను పార్టీ మాడితేనే అభివృద్ధికి సహకరిస్తానని పరోక్షంగా తెలపడం సమంజసం కాదు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేయడం జరిగింది.

## వర్షంలోనూ బోనాలు సమర్పిస్తున్న భక్తులు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భాగ్యనగరంలో ఆషాఢ బోనాల జాతర కోలాహలం అంబరాన్నంటింది. చారిత్రాత్మక గోల్కొండ కోట పరిసరాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. అయితే, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు గోల్కొండ జగదాంబిక అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తలపై బోనమెత్తి, వర్షంలో తడుస్తూనే భక్తజనం అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో తరలివచ్చారు. మరోవైపు పాతబస్తీలోని లాల్దర్వాజా నుంచి గోల్కొండ కోట వైపు సాగిన ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. పోతురాజుల విన్యాసాలు, తీన్మార్ డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపు మార్గమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. లాల్దర్వాజా పరిసరాల నుంచి గోల్కొండ వైపు భక్తులు భారీగా తరలిరావడంతో దారులన్నీ భక్తజన సందోహంగా మారాయి. వర్షం పడుతున్నా జాతర ఉత్సాహం ఏమాత్రం తగ్గకపోగా, డప్పుల శబ్దాల మధ్య భక్తుల కోలాహలంతో గోల్కొండ కోట ప్రాంతం మార్మోగిపోయింది.

## సంపాదకీయం

# అభివృద్ధి అజెండాతో ఎన్నికల వ్యూహం




కొత్త ఎన్నికల సమీకరణలకు తెలంగాణ రాజకీయాలు ఇప్పటి నుంచే వేదికగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెస్ మాత్రం ఎన్నికల వ్యూహాన్ని ముందుగానే అమలు చేస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, వరుస సమీక్షలు, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వడం చూస్తుంటే వచ్చే ఎన్నికలను అభివృద్ధి అజెండాతోనే ఎదుర్కోవాలని అధికార పార్టీ నిర్ణయించినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.తెలంగాణ ఏర్పడిన తర్వాత దశాబ్దకాలం బీఆర్ఎస్ సంక్షేమం, భారీ ప్రాజెక్టులు, ప్రాంతీయ భావోద్వేగాన్ని రాజకీయ ఆయుధాలుగా వినియోగించింది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే తరహాలో సంక్షేమాన్ని కొనసాగిస్తూనే అభివృద్ధిని ఎన్నికల ప్రధాన అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. రాజకీయంగా ఇది సహజ వ్యూహమే. ఎందుకంటే దేశవ్యాప్తంగా జరిగిన అనేక ఎన్నికలు ఒక విషయాన్ని స్పష్టం చేశాయి. సంక్షేమ పథకాలు ప్రజల్లో ఆదరణ పొందినా, అవి ఒక్కటే తిరిగి అధికారాన్ని హామీ ఇవ్వవు. పరిపాలన, అభివృద్ధి, ఉద్యోగాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, పట్టణ అభివృద్ధి వంటి అంశాలు కూడా ఓటర్ల తీర్పును ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో దాదాపు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను ఎన్నికలకు ముందే పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం రాజకీయపరంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. హైదరాబాద్ మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, హ్యామ్ రోడ్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, కొత్త ఆస్పత్రులు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, విమానాశ్రయాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వడం కూడా ఇదే వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది.రాజకీయంగా చూస్తే రేవంత్ రెడ్డి ముందు రెండు సవాళ్లు ఉన్నాయి. ఒకవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయకుండా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడం. ఇప్పటికే ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోంది. అదే సమయంలో అభివృద్ధి పనులపై కూడా భారీ పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత సాధించగలిగితేనే ప్రభుత్వం ఆశించిన రాజకీయ లాభం పొందే అవకాశం ఉంటుంది.అయితే అభివృద్ధి ప్రాజెక్టులను ప్రకటించడం ఒక విషయం అయితే, వాటిని గడువులోగా పూర్తి చేయడం మరో విషయం. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో కూడా అనేక భారీ ప్రాజెక్టులు ప్రకటించబడ్డాయి. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. అందువల్ల ప్రజలు ఇప్పుడు ప్రకటనల కంటే అమలుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇదే అంశం కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా వర్తిస్తుంది.మెట్రో రెండో దశ ప్రాజెక్టు ఇందుకు మంచి ఉదాహరణ. కేంద్ర సహకారం, నిధుల సమీకరణ, అనుమతులు వంటి అంశాలు పూర్తయితేనే పనులు వేగంగా సాగుతాయి. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు కూడా ఆర్థిక, పరిపాలనా సవాళ్లు తక్కువ కావు. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో కేంద్ర-రాష్ట్ర సమన్వయం అత్యంత కీలకం. అంటే ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాలు అధికార యంత్రాంగం సామర్థ్యంతో పాటు కేంద్ర సహకారంపైనా ఆధారపడి ఉన్నాయి.రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించడం కూడా ఇదే నేపథ్యంలో చూడాల్సి ఉంటుంది. రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర నిధులు, అనుమతులు సాధించడం రాజకీయ అవసరంగానే కాకుండా ఎన్నికల వ్యూహంలో కూడా కీలక అంశంగా మారింది. ముఖ్యంగా మెట్రో, ట్రిపుల్ ఆర్, విమానాశ్రయాల వంటి ప్రాజెక్టుల్లో కేంద్రం భాగస్వామ్యం తప్పనిసరి కావడంతో ప్రభుత్వం ఆ దిశగా దూకుడు ప్రదర్శిస్తోంది.మరోవైపు అధికార పార్టీ దృష్టి కేవలం గ్రామీణ ఓటర్లపైనే కాకుండా పట్టణ మధ్యతరగతి, యువత, ఐటీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావంతులపై కూడా పడినట్లు కనిపిస్తోంది. ఈ వర్గాలు సాధారణంగా సంక్షేమ పథకాల కంటే మౌలిక వసతులు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు వంటి అంశాలను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటాయి. అందుకే హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో కూడా పెద్దఎత్తున మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే ప్రతిపక్షాలు మాత్రం ఈ అభివృద్ధి వ్యూహాన్ని ఎన్నికల రాజకీయంగానే అభివర్ణించే అవకాశం ఉంది. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పేరుతో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారని బీఆర్ఎస్, బీజేపీ విమర్శించే అవకాశముంది. ప్రాజెక్టుల ప్రకటనలు ఎక్కువగా ఉన్నాయని, అమలు మాత్రం నెమ్మదిగా సాగుతోందని ప్రతిపక్షాలు ప్రశ్నించే అవకాశం కూడా ఉంది. అందువల్ల ప్రభుత్వానికి రాజకీయంగా మాత్రమే కాకుండా పరిపాలనా పరంగానూ ఫలితాలు చూపించాల్సిన అవసరం ఏర్పడింది.ప్రతివారం ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించడం, ఉన్నతాధికారులకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించడం పరిపాలనా చురుకుదనాన్ని సూచిస్తోంది. అయితే సమీక్షలు ఫలితాలుగా మారినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. గతంలో కూడా అనేక ప్రభుత్వాలు భారీ లక్ష్యాలు ప్రకటించినప్పటికీ, భూ సేకరణ, కోర్టు కేసులు, నిధుల కొరత వంటి కారణాలతో అనేక ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయి. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుంటే ప్రభుత్వం ప్రకటించిన గడువులు ఎంతవరకు సాధ్యమవుతాయన్నది వేచి చూడాల్సిందే.రాబోయే ఎన్నికలు తెలంగాణలో సంక్షేమం వర్సెస్ అభివృద్ధి అనే చర్చకు మాత్రమే పరిమితం కావు. రెండు అంశాల సమన్వయాన్ని ఎవరు మెరుగ్గా అమలు చేశారన్నదే ప్రధాన చర్చగా మారే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తూనే అభివృద్ధిని వేగవంతం చేయాలని భావిస్తే, ప్రతిపక్షాలు అమలులో లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తాయి. చివరికి ప్రజలు ఇచ్చే తీర్పు మాత్రం ప్రభుత్వం చేసిన ప్రకటనలపై కాదు, ఎన్నికల నాటికి భూమిపై కనిపించే అభివృద్ధి, పరిపాలన, ప్రజలకు అందిన ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుంది.అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి అజెండా కేవలం పరిపాలనా కార్యాచరణ మాత్రమే కాదు; అది 2028 ఎన్నికలకు కాంగ్రెస్ రూపొందిస్తున్న ప్రధాన రాజకీయ వ్యూహంగా కూడా చూడవచ్చు. ఈ వ్యూహం ఎంత మేరకు విజయవంతమవుతుందో నిర్ణయించేది అధికార పార్టీ ప్రకటనలు కాదు, గడువులోగా పూర్తయ్యే ప్రాజెక్టులు, ప్రజలకు కలిగే ప్రత్యక్ష ప్రయోజనాలు, వాటిపై ఓటర్ల స్పందనే.




# కమ్ముకున్న కరువు

జులైలో జల్లులు కురవాల్సిన వేళ.. ఏప్రిల్, మే నెలలను తలపించే ఎండలు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులను ఆకాశం నిరాశపరుస్తోంది. ఇదే సమయంలో ప్రపంచ వాతావరణాన్ని శాసించే ఎల్ నినో వేగంగా బలపడుతోందన్న హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే తగ్గుతున్న వర్షాలు, పెరుగుతున్న వేడి.. రాబోయే రోజుల్లో దేశం మరో సంక్షోభాన్ని ఎదుర్కోనబోతోంది. 1950 తర్వాత అత్యంత శక్తివంతమైన ఎల్ నినో ఘటనల్లో ఒకటిగా ఇది నిలిచే అవకాశం ఉందని అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ హెచ్చరించింది. అక్టోబర్-డిసెంబర్ మధ్య 81 శాతం అవకాశంతో వెరీ స్ట్రాంగ్ ఎల్ నినోగా మారవచ్చని తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఈ పరిణామం భారత్‌లో వర్షపాతం, వ్యవసాయం, ఉష్ణోగ్రతలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.దేశానికి ఆహార సంక్షోభం, ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. చినుకు జాడ లేకపోవడంతో...ఆ ప్రభావం అన్ని రంగాలపై పడుతోంది. వ్యవసాయ రంగం కుంటుపడితే...అనేక వ్యవస్థలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. దేశంలో కరువు కమ్ముకొస్తోంది. సకాలంలో రుతుపవనాలు రాకపోవడంతో...చినుకు లేక రైతులు చిత్తయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. కరువు ఎఫెక్ట్ దేశ ఆర్థిక వ్యవస్థను ముంచేయబోతోంది. ఆహార సంక్షోభం, ఆర్థిక సంక్షోభం నుంచి తప్పించుకోవడం అసాధ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో యుద్ధం ప్రభావం వ్యవసాయ రంగం మీద పడటం...మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. అమెరికా-ఇరాన్ యుద్ధానికి కరువు తోడవడం...దేశ ఆర్థిక వ్యవస్థకు గుదిబండలా మారుతోంది.దేశ వ్యాప్తంగా జూన్ నెలలో వర్షపాతం సాధారణం కంటే 42 శాతం తక్కువగా నమోదైంది. గత 146 ఏళ్లలో అత్యంత పొడి వాతావరణం జూన్ నెలలోనే ఉంది. గత దశాబ్దన్నర కాలంలో వేసవి రుతు పవనాలకు ఇది అత్యంత బలహీనమైన ఆరంభం. దీని ఫలితంగా దేశంలోని 76 శాతం ప్రాంతాల్లో వర్షపాతం లోటు, లేదంటే తీవ్ర లోటుగా ఉంది. జూలై కూడా సాధారణం కంటే పొడిగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాగునీరు, తాగునీటి కోసం పర్యవేక్షించే దేశంలోని 166 ప్రధాన జలాశయాలు జూన్ 25 నాటికి మొత్తం నిల్వ సామర్థ్యంలో 26 శాతాన్ని కలిగి ఉన్నాయి. నీటి మట్టాలు ఇందిరా సాగర్‌లో 14 శాతానికి, నాగార్జున సాగర్‌లో 5 శాతానికి, తెహ్రీలో 2 శాతానికి పడిపోయాయి. పసిఫిక్‌లో పెరుగుతున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల కారణంగా ఆ నెలలో రుతుపవన వర్షపాతం మళ్లీ పుంజుకున్నప్పటికీ జూలై నెలలో చాలావరకు వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.దేశ వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ నెలలో గత 126 ఏళ్ల చరిత్రలోనే మూడో అత్యంత దారుణమైన అల్ప వర్షపాతం నమోదైంది. సోమవారం నాటికి దేశవ్యాప్తంగా కేవలం 92.1 మిల్లీమీటర్ల నైరుతి రుతుపవనాల వర్షపాతం మాత్రమే నమోదైంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నప్పటికీ అనుకున్న స్థాయిలో అవి విస్తరించలేదని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దేశంలోని 78 శాతం భౌగోళిక ప్రాంతంలో రుతుపవనాల లోటు ఉంది. ఆయా ప్రాంతాల్లో ఇంకా సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది. ఈ లోటును ఐఎండీ రెండు వర్గాలుగా వర్గీకరించింది. అందులో 64 శాతం సాధారణ లోటు కేటగిరీలో ఉండగా, మరో 14 శాతం భారీ లోటుగా స్పష్టం చేసింది. ఇదే పరిస్థితి జూలై చివరి వరకు కొనసాగితే ఖరీఫ్ సాగు, జలాశయాల మట్టాలు, నీటి లభ్యతపై ఆందోళన వ్యక్తం చేసింది.భారత వాతావరణ శాఖ ప్రకారం.. 1901 నుంచి ఇప్పటి వరకు కేవలం నాలుగు సార్లు మాత్రమే జూన్ నెలలో దేశవ్యాప్తంగా 100 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఇందులో అత్యంత దారణమైన ఏడాదిగా 2009 నిలిచింది. అప్పట్లో కేవలం 87.5 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఆ తర్వాత 1905లో 92.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ ఏడాది జూన్ నెల ఆ తర్వాతి స్థానాన్ని ఆక్రమించనుంది. గతంలో 2014లో 93 మిల్లీమీటర్లు, 1926లో 97.4 మిల్లీమీటర్ల మేర జూన్ వర్షపాతం నమోదు కాగా.. మరికొన్ని అల్ప వర్షపాత సంవత్సరాలుగా 1902లో 109 మిమీ, 1912లో 106.8 మిమీ, 1923 101.7 మిమీగా వర్షపాతం నమోదైంది. సాధారణంగా వాతావరణ శాఖ లెక్కల ప్రకారం జూన్ నెల దీర్ఘకాలిక సగటు వర్షపాతం 165 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా ఉండాలి. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో ఎఫెక్ట్ భయాలతో...ఐఎండీ గత నెలలోనే తన దీర్ఘకాలిక రుతుపవనాల అంచనాను సవరించింది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో సగటు వర్షపాతం 90 శాతానికి పడిపోవచ్చని హెచ్చరించింది. ఈ వర్షభావ పరిస్థితులను దేశంలోని రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.ఐరోపాలో వేసవి వాతావరణంపై ఎల్ నినో ప్రభావం పరిమితంగానే ఉన్నప్పటికీ ఈ ఏడాది భారత రుతుపవనాలపై ఇది ప్రధాన ప్రభావం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, ఇంగ్లండ్‌లోని కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు కాలానుగుణ సగటు కంటే 5 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయి. ఉత్తర ఆఫ్రికా నుంచి వేడి గాలిని రప్పించే స్థిరమైన అధిక పీడన వ్యవస్థ కారణంగా ఏర్పడిన వడగాడ్పులు... మానవ ప్రేరిత వాతావరణ మార్పులతో మరింత తీవ్రమయ్యాయని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ పరిశోధక బృందం తెలిపింది. ఐరోపా వేసవి వాతావరణంపై ఎల్ నినో ప్రభావం పరిమితంగానే ఉన్నప్పటికీ ఈ ఏడాది భారత రుతుపవనాలపై ఇది ప్రధాన ప్రభావం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.దేశంలో కొంతకాలంగా బలహీనపడిన నైరుతి రుతుపవనాలు త్వరలో మళ్లీ పుంజుకోనున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో జరుగుతున్న మార్పుల వల్ల సముద్రపు గాలులు బలంగా వీస్తూ, దట్టమైన మేఘాలు అలుముకుంటున్నాయి. రెండు మూడు రోజుల్లో ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఈ అల్పపీడన వ్యవస్థ క్రమంగా ఒడిశా, బెంగాల్ తీరాల వైపు ప్రయాణించి, తూర్పు భారతదేశంలో వర్షాలు కురిపించనుంది. ఆ తర్వాత రాబోయే వారాల్లో దీని ప్రభావం మధ్య, ఉత్తర భారత దేశాలపై కూడా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూలై మొదటి వారంలో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా.. ఆ తర్వాత మాత్రం రుతుపవనాల్లో హఠాత్తుగా స్తబ్దత ఏర్పడింది. దీనివల్ల దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణ స్థాయి కంటే పడిపోవడమే కాకుండా, ఎండ తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు ఎగబాకాయి. దేశవ్యాప్తంగా ఖరీఫ్ పంటల సాగుపై ప్రతికూల ప్రభావం చూపింది. సమయానికి వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి వంటి ప్రధాన పంటల నాట్లు వేయడం కూడా బాగా ఆలస్యమవుతోంది.ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో... సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.2 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ప్రస్తుతం ఇది మోడరేట్ ఎల్ నినో దశలో ఉన్నప్పటికీ, మరో రెండు మూడు నెలల్లో వేగంగా బలపడే అవకాశం ఉంది. సాధారణంగా 0.5 డిగ్రీలు దాటితే ఎల్ నినోగా, 1.5 డిగ్రీలు దాటితే స్ట్రాంగ్ ఎల్ నినోగా, 2 డిగ్రీలు దాటితే వెరీ స్ట్రాంగ్ ఎల్ నినోగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఉన్న వేడి ధోరణి కొనసాగితే అక్టోబర్-డిసెంబర్ నాటికి ఇది వెరీ స్ట్రాంగ్ ఎల్ నినో స్థాయికి చేరే అవకాశం ఉంది. ఈసారి ఎల్ నినో ఇంత వేగంగా బలపడటానికి పలు కారణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తూర్పు పసిఫిక్‌లో సముద్ర గర్భంలో వేడి పెరగడం, గ్లోబల్ వార్మింగ్ కారణంగా సముద్రాల్లో ఉష్ణశక్తి అధికంగా నిల్వ కావడం, ట్రేడ్ విండ్‌లు బలహీనపడటం వంటి అంశాలు కలిసి ఈసారి ఎల్ నినోను అసాధారణంగా బలపరుస్తున్నాయని ఆయన వివరించారు. ఇదే పరిస్థితి కొనసాగితే తొలి ప్రభావం భారత్‌లోని నైరుతి రుతుపవనాలపైనే పడే అవకాశం ఉందని.. 76 ఏళ్ల రికార్డు బద్దలు కావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.నైరుతి రుతుపవనాలు కొంచెం లేటైనా తెలుగురాష్ట్రాలతోపాటు దేశమంతా విస్తరించాయి. కానీ పరిస్థితులు మాత్రం చాలా భిన్నంగా వున్నాయి. వానలేక అల్లాడిపోయిన మహారాష్ట్రలో భారీ వర్షాలు కుమ్మేస్తున్నాయి. మహారాష్ట్రతోపాటు గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల్లో వర్షం బీభత్సం సృష్టిస్తుంటే..తెలుగురాష్ట్రాలు మాత్రం వాన చినుకు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. గాలులు తప్ప వర్షం పడడం లేదు. అడపాదడపా కొన్ని చినుకులు పడి పోతున్నాయే తప్ప.. పెద్ద వానల్లేవ్. వర్షాకాలం ఆరంభమై నెలన్నర కావొస్తోంది. కానీ తెలుగు రాష్ట్రాల్లో ఇంత వరకూ ఆశించిన స్థాయిలో వానలు పడలేదు. రాబోయే రోజుల్లో తగినంత వానలు పడే సూచనలు కూడా లేవు. ఇప్పటికే డెడ్‌స్టోరేజికి చేరిన ప్రాజెక్టుల్లో నీళ్లు నిండుకుంటున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. పరిస్థితి చూస్తుంటే కరువు కాటు తప్పదేమోనని ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది.కొన్నిచోట్ల రైతులు పొలాల్లో వేసిన విత్తనాలు మొలకలు రాలేదు. మరికొన్ని చోట్ల మొలిచినా నీళ్లు లేక ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ప్రాణహిత మినహా ఇతర ప్రాజెక్టులకు ఇంకా వరదలే మొదలు కాలేదు. ఇప్పటికే పరిస్థితి ఆందోళనకరంగా ఉండగా.. మరో వారం పది రోజుల పాటు తెలంగాణలో పెద్దగా వానలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతోంది.పైగా రెండు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగి డ్రై సీజన్ ఉండే చాన్సెస్ అధికంగా ఉన్నాయంటోంది. అప్పుడప్పుడు.. తేలికపాటి వర్షం పడుతుందే తప్ప వారం పాటు భారీ వర్షాల ఊసే ఉండదని చెబుతోంది.అదే సమయంలో ఈ వారం పాటు గాలుల ఉధృతి కొనసాగుతుందని స్పష్టం చేస్తోంది. జులై నెలలో రెండు వారాలు ముగిసినా...ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలా జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. వానలు పడతాయనే నమ్మకంతో దుక్కులు దున్ని, విత్తనాలు వేసిన రైతులు ఇప్పుడు మొలకలు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరికొన్ని చోట్ల నీరు లేక నారుమళ్లు ఎండిపోతుండగా, బావులు, బోర్లలో కూడా నీటిమట్టాలు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు ఏవి...?




**మణుగూరు,ఫ్లాష్ ఇండియా :** నిత్యం పాఠశాలలు, కళాశాలల స్కూల్ బస్సులు, ఆటోలపై నిఘా ఉంచాల్సిన ఆర్టీవో అధికారులు మచ్చుకైనా కానరావడం లేదు. ప్రైవేట్ పాఠశాలలు కళాశాలల బస్సులకు, ఆటోలకు ఫిట్ నెస్ ఉందా లేదా అనేది అర్థం కాని పరిస్థితి. అదేవిధంగా విద్యార్థులను ఎంత పరిమితిలో ఎక్కించాలి అనే నిబంధనలు ఉన్నాయి. కానీ ఆ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. అయినా సరే వారిపై ఎలాంటి చర్యలు ఉండవు. బస్సుల్లో, ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులకు పాఠశాలలకు తరలిస్తున్నారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు ఊహించని విధంగా నష్టం జరుగుతుంది.

**ప్రమాదాలు జరిగినప్పుడే తనిఖీలు నిర్వహిస్తారా..**

అయినా సరే ఇవేమీ పట్టకుండా పాఠశాలల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఎవరు ఎన్నిసార్లు చెప్పినా వారి పద్ధతిలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. పాఠశాలలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోలకు అసలు నెంబర్ ప్లేట్లే లేవు. ఇవన్నీ ఆర్టీవో అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే తనిఖీలు నిర్వహిస్తారా అంటూ పలువురు మండిపడుతున్నారు. నిత్యం తనిఖీలు నిర్వహించాల్సిన ఆర్టీవో అధికారులు ఇటువైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు విద్యార్థుల ఫీజులపై ఉన్న మక్కువ వారి రక్షణ పై ఉండదా. ఆర్టీవో అధికారులు తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదు... ఇటువైపు కన్నెత్తి చూడక పోవడానికి కారణాలేమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీవో అధికారులు తనిఖీలు నిర్వహించాలని, పరిమితికి మించి విద్యార్థులని ఎక్కించకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# స్కూల్‌లో 'కల్మా' హోంవర్క్ వివాదం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని సైదాబాద్‌లో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి హిందూ విద్యార్థికి 'కల్మా' చదవాలని, ఖురాన్ లోని భాగాన్ని హోంవర్క్‌గా ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అయితే విషయం వెలుగులోకి రావడంతో సంబంధిత టీచర్‌ను యాజమాన్యం సస్పెండ్ చేసినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై తెలంగాణ బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అందిన సమాచారం ప్రకారం.. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థికి 'కల్మా' చదవాలని, ఖురాన్‌కు సంబంధించిన పాఠాన్ని హోంవర్క్‌గా ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో వారు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత ఆయేషా అనే టీచర్ పై స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తుంది.ఈ ఘటనపై స్పందించిన పాఠశాల యాజమాన్యం, తమ పాఠశాలలో ఎలాంటి మతపరమైన బోధనలు నిర్వహించడం లేదని స్పష్టం చేసింది. విద్యార్థులకు కేవలం విద్య మాత్రమే అందిస్తున్నామని పేర్కొంది. ఈ ఘటన గురించి ముందుగా తమకు సమాచారం లేదని, విషయం తెలిసిన వెంటనే సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకున్నామని తెలిపింది. పాఠశాలలో ఎక్కువ మంది ముస్లిం విద్యార్థులు ఉన్నప్పటికీ, మతపరమైన బోధనలకు తావు లేదని యాజమాన్యం వెల్లడించింది. మరోవైపు ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో స్పందించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత మార్పిడికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే సంబంధిత పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా ఈ ఘటనను ఖండించారు. హిందూ సంస్కృతిపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, పాఠశాల యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సమాజం మొత్తం స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులపై ఎలాంటి మతపరమైన ఒత్తిళ్లు తీసుకురావడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే గుర్తింపు కూడా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి

**ఏన్కూర్,ఫ్లాష్ ఇండియా :** వాతావరణంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకొని, ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం లేకపోవడంతో వరి సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, కంది, జొన్న, సజ్జ, ఆముదం పంటలపై మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ వైరా డివిజన్ ఏడీఏ టి. కరుణశ్రీ అన్నారు.గురువారం ఏన్కూర్ మండలంలోని గార్లఒడ్డు, నూకాలంపాడు తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూగర్భ జలాల పెంపు కోసం రైతులు పంట కుంటలు తవ్వించుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగి, జాబ్ కార్డు ఉన్న ప్రతి రైతు 10 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు, 2 మీటర్ల లోతుతో పంట కుంటలు తవ్వించుకోవచ్చని తెలిపారు.ఈ పథకం కింద ఫార్మ్ పాండ్ నిర్మాణానికి రూ.96 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు అంచనా వ్యయం ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఏవో నరసింహారావు, ఏఈఓ భూక్య లహరి, సఫావత్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలే అతిపెద్ద సవాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలు, సాంకేతిక సామర్థ్యాల పెంపు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపడుతున్న కార్యక్రమాలపై డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని సైబర్ ల్యాబ్, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ , సెంట్రల్ మానిటరింగ్ యూనిట్, సోషల్ మీడియా యూనిట్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, డిజిటల్ ఫోరెన్సిక్ యూనిట్ తదితర విభాగాలను ఆయన సందర్శించారు. వాటి పనితీరు, సాంకేతిక సామర్థ్యాలు, దర్యాప్తు విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని క్షుణ్ణంగా సమీక్షించారు. ఇందులో భాగంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్‌తో పాటు ఇతర అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు విధానాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, బాధితులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై డీజీపీకి వివరించారు.

**ఏఐ ఆధారిత కాల్ సెంటర్ పనితీరుపై డీజీపీ ప్రశంసలు..**

సమీక్షలో సందర్భంగా డీజీపీ స్వయంగా ఏఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పనితీరును పరిశీలించారు. 'నేను సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయాను' అని బాధితురాలు చెప్పగానే ఏఐ వ్యవస్థ వెంటనే స్పందించి, ఆమెకు ధైర్యం చెబుతూ పేరు, ప్రాంతం, సమీప పోలీస్ స్టేషన్, సంఘటన వివరాలను సేకరించింది. అదే సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం చేరే విధానాన్ని డీజీపీ పరిశీలించి అభినందించారు. ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత సేవలను విస్తరించాలని అధికారులకు సూచించారు.

**సైబర్ నేరాల నియంత్రణలో ఆశాజనక ఫలితాలు**

సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం, 2025లో తెలంగాణలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనప్పటికీ, 2024తో పోలిస్తే ఆర్థిక నష్టాల్లో 20 శాతం తగ్గుదల నమోదైంది. అదే విధంగా సైబర్ ఫిర్యాదులు 91,369కు పరిమితమవడంతో ఫిర్యాదులలో కూడా 3 శాతం తగ్గుదల నమోదైంది. నేరస్తుల ఖాతాల్లోని నిధులను నిలిపివేసే POH (Hold) మొత్తం రూ. 255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు పెరగగా,,రూం శాతం 9 శాతం నుంచి 12 శాతానికి పెరిగింది. ఇది బాధితుల సొమ్ము రక్షణలో తెలంగాణ సాధించిన పురోగతికి నిదర్శనమని అధికారులు వివరించారు.

**సైబర్ నేరాల గుర్తింపు, నమోదులో తెలంగాణ రికార్డు**

2025లో దేశవ్యాప్తంగా నమోదైన 49,620 సైబర్ ఎఫ్ఐఆర్‌లలో తెలంగాణలోనే 21,639 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అంటే దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం సైబర్ ఎఫ్ఐఆర్‌లలో 44 శాతం తెలంగాణ నుంచే నమోదయ్యాయి. దీంతో సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. అలాగే రూ.75 లక్షలకు పైగా నష్టం కలిగిన కేసుల్లో 78 శాతం, రూ.1 లక్షకు పైగా నష్టం ఉన్న కేసుల్లో 56 శాతం ఎఫ్ఐఆర్ కన్వర్షన్ రేటు నమోదు కావడం రాష్ట్ర పోలీసుల సమర్థవంతమైన చర్యలకు నిదర్శనమని అధికారులు వివరించారు.

**ఇతర నేరాల కంటే సైబర్ నేరాల వల్లే అత్యధిక ఆర్థిక నష్టం**

2025లో రాష్ట్రంలో నమోదైన 86,177 ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్‌లలో 21,639 సైబర్ నేరాలకు సంబంధించినవే. అంటే ప్రతి నాలుగు ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్‌లలో ఒకటి సైబర్ నేరానిదే కావడం గమనార్హం. ఇతర ప్రధాన నేరాల వల్ల రూ. 207 కోట్ల ఆర్థిక నష్టం జరగగా, సైబర్ నేరాల వల్ల ఏకంగా రూ. 1,524 కోట్ల నష్టం సంభవించింది. అంటే ఇతర ప్రధాన నేరాల కంటే దాదాపు ఏడు రెట్లు అధిక ఆర్థిక నష్టం సైబర్ నేరాల వల్లే జరుగుతోందని అధికారులు వెల్లడించారు.అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని అన్నారు. జీవితాంతం కూడబెట్టుకున్న పొదుపులను ఒక్క క్షణంలో కోల్పోతున్నారని కామెంట్ చేశారు. భవిష్యత్‌లో నేరాల స్వరూపం ప్రధానంగా సైబర్ నేరాల చుట్టూనే తిరుగుతుందని అన్నారు. తాను డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట సందర్శించిన ప్రత్యేక విభాగాల్లో ఈగిల్ ఒకటి కాగా, ఇప్పుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర భద్రతలో ఈ రెండు విభాగాలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు.సైబర్ నేరాలు వేగంగా రూపాంతరం చెందుతున్నందున కొత్త ఆలోచనలు, కృత్రిమ మేధస్సు , ఆధునిక సాంకేతికత, డేటా అనలిటిక్స్ వినియోగిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సీవీ ఆనంద్ సూచించారు.



కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న జాతీయ పనితీరు సూచికల్లో తెలంగాణ మరింత మెరుగైన స్థానం సాధించేలా సాంకేతిక వ్యవస్థలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక బలగాల పునర్వ్యవస్థీకరణతో పాటు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన ప్రత్యేక విభాగాల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. అవసరమైతే మానవ వనరులను సమర్థంగా వినియోగించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఇటీవలి కాలంలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లు, డిజిటల్ ఫైనాన్షియల్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్న డీజీపీ, ఇప్పుడే వీటిని సమర్థంగా నియంత్రించకపోతే భవిష్యత్‌లో మరింత తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తెలంగాణను సాంకేతికత ఆధారిత సైబర్ పోలీసింగ్‌లో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**పోలీసుల కీలక విజ్ఞప్తి..**

ప్రజలు సైబర్ మోసాలకు గురైన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. ఓటీపీలు , పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలు, ఇతర ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని తెలంగాణ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీతో పాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఎస్పీలు హర్షవర్ధన్, సాయి శ్రీ, డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం



హనుమకొండ కలెక్టరేట్: మామూనూరు ఎయిర్‌పోర్టుపై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం అని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపనేని నరేందర్‌లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. మామూనూరు ఎయిర్‌పోర్టు నిజాం కాలంలో నిర్మించబడింది.మామూనూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ అనేకసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిశారు. ఉడాన్ పథకం సమయంలో కూడా కేంద్రంతో నిరంతరం చర్చలు జరిపిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థతో కేటీఆర్ చర్చించి ముందుకు తీసుకెళ్లారు. 1.8 కి.మీ రన్‌వేను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 3.8 కి.మీగా విస్తరించేందుకు రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టామని తెలిపారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# బోనస్‌కు కొత్త నిబంధనలు..


**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం పంటకు బోనస్ అందించేందుకు కొత్త నిబంధనలను విధించింది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ప్రభుత్వం సూచించిన ధాన్యానికే బోనస్ చెల్లించనుంది. ప్రభుత్వం ఏడు రకాల వరి వంగడాలను సాగుచేయాలని సూచించింది. ఖరీఫ్ కాలంలో పండించిన ధాన్యానికి బోనస్ పొందాలంటే ప్రభుత్వం నిబంధనల మేరకు సన్న రకాల వరి పంటలను సాగు చేయాల్సి ఉంటుంది. పంట చేతికి వచ్చిన తరువాత పంట రకాన్ని బట్టి బోనస్ చెల్లిస్తారని వ్యవసాయ అధి కారులు చెబుతున్నారు.విత్తనాలను కొను గోలు చేసిన వెంటనే దుకాణదారుడు తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అందుకు ప్రభుత్వం దుకాణదారుడికి డిజిటల్ లాగిన్‌ను ఇస్తుంది. ధాన్యం కొనుగోలు చేసే రైతులు వివరాలను పాస్‌బుక్ ఆధారంగా నమోదు చేస్తారు. విత్తనాల కొనుగోలు వివరాలను వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఏఈవోలు పంటల నమోదులో సరి చూసుకుంటారు.కొనుగోలు చేసిన విత్తనాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే బోనస్ వచ్చే అవకాశం ఉండదు. ప్రభుత్వం ఏడు రకాల వరి వంగడాలను పండించాలని సూచిందింది. వీటికి మాత్రమే బోనస్ చెల్లించనున్నారు. ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరాం, డబ్ల్యుజీఎల్ 44 (సిద్ధి), కేఎన్ఎం 7715 వరి వంగడాలను వాడాలని ప్రభుత్వం రైతులకు సూచించింది.



ప్రభుత్వం సూచించిన వంగడాలనే సాగు చేయాలి

**బి సత్యం, మండల వ్యవసాయ శాఖ అధికారి**

ప్రభుత్వం సూచించిన వంగడాలను మాత్రమే రైతులు సాగు చేయాలి. డీర్ల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. లేకుంటే సన్న రకాలకు బోనస్ రాదు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు వాటి వివరాలు ఆన్‌లైన్ చేసుకోవడం మరచిపోవద్దు.



# డ్రగ్స్ కేసులో ఎమ్మెల్సీ కుమారుడు అరెస్ట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో సంచలనం పరిణామం చోటు చేసుకుంది. మాదకద్రవ్యాల (Drugs) సరఫరా, వినియోగం పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న క్రమంలో ఓ ఎమ్మెల్సీ కుమారుడు అరెస్ట్ కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లోని మంగళహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక భారీ తనిఖీ ఆపరేషన్‌లో ఒక ప్రముఖ ఎమ్మెల్సీ (మీజ) కుమారుడు పోలీసులకు పట్టుబడటం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. డ్రగ్స్ విక్రయిస్తూ, వినియోగిస్తున్నారనే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఎమ్మెల్సీ కుమారుడితో పాటు మరికొంతమందిని పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలుస్తుంది.మంగళహాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ నెట్‌వర్క్ నడుపుతున్న కొందరు వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచిన ప్రత్యేక బృందాలు ఈ మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఎమ్మెల్సీ కుమారుడు భరత్ డ్రగ్స్ సప్లై చేస్తున్న ముఠాతో సంబంధాలు కలిగి ఉన్నట్లు, స్వయంగా పాల్గొన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. భరత్‌తో పాటు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న మరికొందరు బడా బాబుల పిల్లలను, కీలక నిందితులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? దీని వెనుక ఉన్న అంతర్రాష్ట్ర ముఠాల హస్తం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు నిందితులను ముమ్మరంగా విచారిస్తున్నట్లు సమాచారం. కాగా తాజా పరిస్థితుల్లో రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి కుమారుడు దొరకడంతో ఈ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.




# ఢిల్లీలో భారీ ఆపరేషన్..

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధానిలో అక్రమ ఆయుధాల చలామణీ, క్రిమినల్ గ్యాంగుల నెట్‌వర్క్‌ను అణచివేసేందుకు ఢిల్లీ పరిధిలోని రోహిణి జిల్లా పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. క్షేత్రస్థాయిలో పక్కా నిఘా ఉంచి, రెండు రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించిన ఈ ప్రత్యేక జాయింట్ ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజుల పాటు ముమ్మర దాడులు.. రోహిణి జిల్లా డీసీపీ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఈ మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో 19 అక్రమ పిస్టల్స్ (తుపాకులు), 26 లైవ్ బులెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీస్ ఉన్నతాధికారులు అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ అక్రమ ఆయుధాల దందాతో సంబంధం ఉన్న 31 మంది నిందితులను పోలీసులు వేర్వేరు ప్రాంతాలలో అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో కొందరు అంతర్రాష్ట్ర ఆయుధ సరఫరాదారులు, స్థానిక గ్యాంగ్‌స్టర్లు ఉన్నట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్, హర్యానాల నుండి ఈ ఆయుధాలను ఢిల్లీలోకి తెచ్చి నేరస్తులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రాబోయే పండుగలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రతా ఏర్పాట్ల నేపథ్యంలో పోలీసులు ఈ ముఠాలను అరెస్ట్ చేయడం శాంతిభద్రతల పరంగా పెద్ద విజయంగా భావిస్తున్నారు.

# పిఏసిఎస్ నూతన చైర్మన్‌గా గరిసె రవి



**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం గురువారం అధికారికంగా కొలువుదీరింది. నూతన చైర్మన్‌గా గరిసె రవి బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా జక్క జంగారెడ్డి, డైరెక్టర్లుగా బత్తిని లింగమ్మ, యెమ్మె మల్లేశం, బూడిద పద్మ, కట్ట లింగస్వామి, గూడూరు మోహన్ రెడ్డి, వనగంటి జహంగీర్, బుగ్గ బీరప్ప, కలుకూరి చంద్రయ్య, బర్ల నర్సింహ, బంగారి మహిపాల్, వనం నర్సింహలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గరిసె రవి మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తనపై ఉంచిన విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. రైతులకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ ప్రాంత ప్రజాప్రతినిధులు, సహకార సంఘం సభ్యులు, రైతులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**మేడ్చల్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియను మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. ఈ మేరకు బిఎల్వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని బిఎల్ఓ లకు ఈ సందర్భంగా సూచించారు. గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని శామీర్ పేట గ్రామంలో జరుగుతున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి ఎల్ వో లకు మొత్తం ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు కేటాయించారు, ఇప్పటి వరకు ఎన్ని ఫారాలు అందించారు, తిరిగి ఎన్ని ఫారాలు తీసుకున్నారు అని బిఎల్ ఓలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న ఫారాల డిజిటలైజ్ ఏవిధంగా చేస్తున్నారని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవసరమైన మేర సహాయం అందించాలని బిఎల్ఓలకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహసీల్దారు సిహెచ్. శ్రీనివాస్, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# 35 వ వార్డు అభివృద్ధికి నిధులు విడుదల చేయండి...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ నేతృత్వంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ మరియు మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజ రెడ్డి గాంధీనగర్ 35 వ వార్డు లోని పలు సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి గురువారం ఉదయం ఏడు గంటలకు వెళ్లడం జరిగింది. వారికి 35 వ వార్డు కౌన్సిలర్ దైద సోమ సుందరం స్వాగతం పలికి దగ్గరుండి వార్డులోని పలు పలు వీధులలో కలియతిరిగి ప్రధాన సమస్యలు అయిన డ్రైనేజీ, విద్యుత్ దీపాలు మరియు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డులోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేడీ ఆఫీసర్‌పై దాడి..

**కాగజ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చోలే అనితపై దాడి కేసు ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు, ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు సహా మరో 8 మందికి ఆదిలాబాద్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ తాజాగా కోర్టు తీర్పు వెలువరించింది. 2019లో కాగజ్ నగర్ డివిజన్ పరిధిలోని సార్సాల గ్రామంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అటవీ అధికారులు భూమిని చదును చేస్తుండగా కర్రలతో వచ్చిన గ్రామస్తులు కోనేరు కృష్ణారావు ఆధ్వర్యంలో అధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిత తీవ్రంగా గాయపడ్డారు. అయితే కోనేరు కృష్ణ గ్రామస్తులను రెచ్చగొట్టారని, తనపై దాడి చేశారని అనిత ఆరోపించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ కేసులో కోర్టు తాజాగా నిందితులకు జైలు శిక్ష ఖరారు చేసింది.



# ఫారెస్ట్ అధికారులపై దాడి కేసులో 8 మందికి జైలు..

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన 2019 నాటి ఫారెస్ట్ అధికారులపై దాడి కేసులో జిల్లా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. కాగజ్‌నగర్ మండలం సారసాల గ్రామంలో అటవీ శాఖ అధికారులపై దాడికి పాల్పడిన కేసులో ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణతో పాటు మొత్తం 8 మంది నిందితులకు 6 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. వివరాల్లోకి వెళితే.. 2019 జూన్ 30న కాగజ్‌నగర్ మండలం సారసాల అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తున్న సమయంలో వారిని అడ్డుకుని దాడి చేసిన ఘటనపై ఫారెస్ట్ రేంజ్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పించడం, దాడి చేయడం, బెదిరించడం తదితర అభియోగాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలు, పత్రాలను సుదీర్ఘంగా పరిశీలించిన జిల్లా కోర్టు కోనేరు కృష్ణతో పాటు మరో ఏడుగురు నిందితులను దోషులుగా నిర్ధారించింది. దీంతో వారందరికీ ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించడంతో పాటు వివిధ సెక్షన్ల కింద జరిమానా కూడా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఏళ్లుగా విచారణ కొనసాగిన ఈ కేసులో వెలువడిన తాజా తీర్పు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పించడం, వారిపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసినట్లైంది. ఈ కేసులో ప్రభుత్వ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్‌పీపీ) రమణారెడ్డి వాదనలు వినిపించారు. జిల్లా కోర్టు వెలువరించిన తీర్పు వివరాలను ఎస్‌పీపీ రమణారెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయంగా ప్రాధాన్యం ఉన్న వ్యక్తికి శిక్ష పడటం జిల్లాలో ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పుతో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారగా, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పించడం, వారిపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు స్పష్టం చేసినట్లైంది.

# జాతీయ రహదారి పక్కన వ్యక్తి ఆత్మహత్య



**నర్సంపేట,ఫ్లాష్ ఇండియా :** జాతీయ రహదారి-365 పక్కన చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లబెల్లి మండలం శనిగరం గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దేవేందర్‌గా గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. గురువారం ఉదయం కూలీలను ముద్దనూరు తండాకు తీసుకెళ్లిన అనంతరం తిరుగు ప్రయాణంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానా లేదా ఇతర కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రామన్నపేటలో మహాధర్నా

## విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

విద్యార్థులకు వ్యతిరేకంగా
తెచ్చిన జీవో నెంబర్ 9, ఆర్ఆర్
యాక్ట్ ను రద్దు చేయాలి
పభుత్వ నాయకులకు
కమిషన్లు రావనే విద్యార్థుల
స్కాలర్షిప్పు ఇవ్వట్లేదు





**రామన్నపేట, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని వేల మంది విద్యార్థులతో రామన్నపేట పట్టణ కేంద్రంలో గురువారం మహా ధర్నా నిర్వహించారు. నాయకులకు, పోలీసులకు వాగ్వాదం తదనంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ ఆదేశానుసారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగోర్ల మోదీరాందేవ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అక్కినపల్లి సైదులు, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, బిసి నాయకులు సురేష్, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు. రామన్నపేట సుభాష్ సెంటర్లో మహాధర్నా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాత్రను రద్దు చేయాలన్నారు. విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేసి పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికి, మూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయిగాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా అని ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు. ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని కాలేజి యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్నా ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలన్నారు. సంక్షేమ హాస్టల్ లకు సొంతభవనాలు నిర్మించాలని అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వటంతోపాటు మెస్ చార్జీలు పెంచాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5లక్షల భరోసా కార్డు ఇవ్వాలన్నారు. 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ, ఇందిరగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్ర ప్రజల బ్రతుకులపై ఏమాత్రం సోయిలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి అని అన్నారు. ప్రభుత్వాన్ని నిరుద్యోగులు జబ్బకు సంచేసుకొని ఊరూరు తిరిగి అధికారంలో తీసుకొస్తే ఈ ప్రభుత్వం నిలువున ముంచిందని తెలిపారు. హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదమున్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా కొట్లాడి తెప్పిస్తే ఆ జీవోను ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని తుంగలోకి తొక్కుతుందని ధ్వజమెత్తారు. రాజకీయంగా ఆర్థికంగా విద్యా పరంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను ఎదగకుండా అగ్రవర్ణ నాయకులు, ప్రభుత్వం కుట్ర చేస్తున్నాయని అన్నారు. ఇక నుండి ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరిస్తూ ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. జనాభా తమాషా ప్రకారంగా ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించి విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఎంపీ ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసి ప్రభుత్వాని అట్టుడికిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టిఎస్ఎస్ఎ కూరెళ్ళ మహేష్, బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ, బిఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయ్ శ్రీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ యాదగిరి కుమార్తె మాన్విక. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి








**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ కల్వకోలు యాదగిరి పెద్ద కుమార్తె. మాన్విక జన్మదిన వేడుకల్లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొని. మాన్విక తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి. మాన్విక ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో. ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలాల్. జిల్లా జర్నల్ సెక్రటరీ గోరేటి నర్సింహ. బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు తిరుమణి రవి గౌడ్. జర్నలిస్ట్ విష్ణువర్ధన్ యాదవ్. విజయ్ యాదవ్. జూలపల్లి సర్పంచ్ శేఖర్ యాదవ్. వెంకట్రావు పేట సర్పంచ్ ఇమ్మడి మహేష్. బిజెపి సీనియర్ నాయకులు. సూరెడ్డి శ్రీనివాస్ రెడ్డి. శానమోని పాండు. శేఖర్ రెడ్డి. నీలకంఠ పాండు. పద్మ అనిల్. హరికాంత్. మల్లేష్ గౌడ్. శేఖర్ చారి. తిరుమణి రాఘవేందర్ గౌడ్. బూత్ అధ్యక్షుడు రాము. అక్బర్. అయిలు ఆంజనేయులు గౌడ్. వెంకటాపురం బూత్ అధ్యక్షుడు శివ. తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** ఆషాఢ శుద్ధ విదియను పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలో జగన్నాథ రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భగవంతుడు స్వయంగా భక్తుల వద్దకు వస్తాడనే నమ్మకంతో రథయాత్రను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను అలంకరించిన రథాలు పట్టణ వీధుల్లో ఊరేగిస్తూ భక్తులు జై జగన్నాథ నినాదాలతో పెద్ద మొత్తంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. సంప్రదాయ భజనలు, మంగళ వాయిద్యాలు, నృత్యాలు, భక్తుల హారతులతో భారీ సంఖ్యలో ప్రజలు రథాలను తాళ్లతో లాగారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం రథయాత్రలో భక్తులతో కలిసి రథాలను లాగుతూ స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్, సుదీర్, అశోక్, శివ, పినమోని గోపాల్, శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ లోహాటి, తంగడపల్లి శంకర్, మాజీ జెడ్పీటీసీ సాయికృష్ణ, జయప్రకాష్, మురళి, గంగమోని సత్తయ్య, రవితేజ, భక్తులు పాల్గొన్నారు.



# గోల్డెన్ బూట్ గెలుస్తాడా?

ప్రపంచకప్ ట్రోఫీ కోసం ఒక చివరి అడుగు మాత్రమే మిగిలి ఉంది. కానీ లియోనెల్ మెస్సీ ముందు ఇప్పుడు మరో అరుదైన అవకాశం కూడా నిలిచింది. అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడికి ఇచ్చే గోల్డెన్ బూట్ అవార్డుపైనా మెస్సీ కన్నేశాడు. ఫైనల్‌లో స్పెయిన్‌పై మెస్సీ ప్రదర్శన ఎలా ఉంటుందనే ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో నెలకొంది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్ సెమీఫైనల్లో అర్జెంటీనా 2–1 తేడాతో విజయం సాధించగా, ఆ విజయానికి మెస్సీ ప్రధాన శక్తిగా నిలిచాడు. గోల్ చేయకపోయినా రెండు అద్భుతమైన అసిస్ట్‌లతో మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేశాడు. ఇంగ్లాండ్ ముందంజలో ఉన్న సమయంలో మెస్సీ తన అనుభవాన్ని, ఆటపై ఉన్న పట్టు చూపించి అర్జెంటీనాను తిరిగి పోటీలోకి తీసుకొచ్చాడు. ఎంజో ఫెర్నాండెజ్ సమం చేసిన గోల్‌కు కార్నర్ ద్వారా అవకాశాన్ని సృష్టించిన మెస్సీ, అదనపు సమయంలో లౌటారో మార్టినెజ్ చేసిన విజేత గోల్‌కూ అద్భుతమైన క్రాస్ అందించాడు. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటికే ఎనిమిది గోల్స్, నాలుగు అసిస్ట్‌లతో మెస్సీ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. గోల్స్ పరంగా ఫ్రాన్స్ స్టార్ కైలియన్ ఎంబాపేతో సమానంగా ఉన్నాడు. అయితే ఇద్దరి గోల్స్ ఒకే సంఖ్యలో ముగిస్తే అసిస్ట్‌లు నిర్ణయాత్మకంగా మారతాయి. ఆ విషయంలో మెస్సీకి నాలుగు అసిస్ట్‌లు ఉండగా, ఎంబాపే ఖాతాలో మూడు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రస్తుతం గోల్డెన్ బూట్ రేసులో మెస్సీకి స్వల్ప ఆధిక్యం కనిపిస్తోంది. అయితే పోటీ ఇంకా ముగియలేదు. మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో ఫ్రాన్స్ తరఫున ఎంబాపే బరిలోకి దిగనున్నాడు. అతను గోల్ చేస్తే లెక్కలు మారిపోతాయి. మరోవైపు ఇంగ్లాండ్ ఆటగాళ్లు జూడ్ బెల్లింగ్‌హామ్, హ్యారీ కేన్ చెరో ఆరు గోల్స్‌తో ఉన్నప్పటికీ గోల్డెన్ బూట్ అవకాశాలు పూర్తిగా కోల్పోలేదు. అయినప్పటికీ అందరి చూపు మాత్రం మెస్సీ, ఎంబాపే మధ్యే నిలిచింది. మెస్సీ ఇప్పటికే ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా కొత్త రికార్డు సృష్టించాడు. మొత్తం 21 ప్రపంచకప్ గోల్స్‌తో అగ్రస్థానంలో నిలిచిన అతడు, వాటిలో 15 గోల్స్ తన 35 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత చేయడం విశేషం. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపిస్తూ ప్రతి మ్యాచ్‌లో జట్టుకు అవసరమైన సమయంలో తన ముద్ర వేస్తున్నాడు. సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై మెస్సీ ప్రదర్శన గణాంకాలు కూడా అతని ప్రభావాన్ని స్పష్టంగా చూపించాయి. తొమ్మిది విజయవంతమైన డ్రిబుల్స్, నాలుగు కీలక అవకాశాల సృష్టి, ప్రత్యర్థి బాక్స్‌లో ఏడు టచ్‌లు, అత్యధికంగా తొమ్మిది క్రాస్‌లు నమోదు చేశాడు. ముఖ్యంగా మ్యాచ్ చివరి పదిహేను నిమిషాల్లో ఆటను పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకొని అర్జెంటీనా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల దృష్టి అంతా ఫైనల్‌పైనే ఉంది. స్పెయిన్‌పై మెస్సీ మరోసారి గోల్ చేయగలడా, లేక అసిస్ట్‌తో తన మాయాజాలాన్ని కొనసాగిస్తాడా అన్న ఉత్కంఠ నెలకొంది. ఫైనల్‌లో అతని ప్రదర్శన అర్జెంటీనాకు మరో ప్రపంచకప్ అందించడమే కాకుండా గోల్డెన్ బూట్‌ను కూడా అతని ఖాతాలో వేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఎనిమిదిసార్లు బాలన్ డి'ఓర్ గెలిచిన ఈ దిగ్గజం కెరీర్‌లో మరో చారిత్రక అధ్యాయం చేరినట్లే అవుతుంది.

# వన్డే సిరీస్‌పై కన్నేసిన టీమిండియా..



ఇంగ్లాండ్ పర్యటనలో వరుస పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న టీమిండియా ఎట్టకేలకు మొదటి వన్డేతో విజయాల బాట పట్టింది. ఐర్లాండ్ చేతిలో 0–2తో టీ20 సిరీస్‌ను కోల్పోయిన భారత జట్టు, ఆ తర్వాత ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో కూడా 4–0తో వైట్‌వాష్‌కు గురైంది. అయితే సీనియర్స్ రాకతో వన్డే సిరీస్‌ను మాత్రం ఘనంగా ప్రారంభించింది. తొలి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ విజయంతో 1–0 ఆధిక్యంలో నిలిచింది. ఇప్పుడు కార్డిఫ్‌లో జరిగే రెండో వన్డేలో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో అక్షర్ పటేల్ అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మ్యాచ్‌ను గెలిపించాడు. బ్యాటింగ్‌లో అజేయంగా 57 పరుగులు, బౌలింగ్‌లో 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 75 బంతుల్లో 80 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగినా, తన క్లాస్‌ను మరోసారి చూపించాడు. వాషింగ్టన్ సుందర్ కూడా అజేయంగా 52 పరుగులు చేసి అక్షర్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. వన్డే సిరీస్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు తిరిగి జట్టులో చేరినా.. తొలి మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అయినప్పటికీ వారి అనుభవం జట్టుకు కాస్త ధైర్యాన్ని అందించిందని గట్టిగా చెప్పవచ్చు. అలాగే భారత పేసర్లు గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణ తొలి వన్డేలో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కొత్త బంతితో ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. ఇంగ్లాండ్ విషయానికి వస్తే.. తొలి వన్డేలో జాకబ్ బెథెల్, బెన్ డకెట్ మంచి ఆరంభం ఇచ్చినా, దాన్ని భారీ స్కోర్‌గా మార్చలేకపోయారు. గుర్నూర్ బ్రార్ వేసిన ఓవర్‌లో ఇద్దరూ ఔటవడంతో మ్యాచ్ భారత్ వైపు మళ్లింది. మరోవైపు గాయం కారణంగా జేమీ ఓవర్టన్ దూరం కావడం ఇంగ్లాండ్‌కు ఎదురుదెబ్బగా మారింది. అతని స్థానంలో గస్ అట్కిన్సన్ లేదా సామ్ కరన్‌కు అవకాశం లభించే అవకాశం ఉంది. కార్డిఫ్‌లోని సోఫియా గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. కొత్త బంతితో పేసర్లకు స్వింగ్, బౌన్స్ లభించే అవకాశం ఉంది. మ్యాచ్ ముందుకు సాగే కొద్దీ బ్యాటింగ్ సులభమవుతుంది. స్పిన్నర్లకు కూడా కొంత టర్న్ లభించే అవకాశముంది. జూలై 16న కార్డిఫ్‌లో ఎండతో కూడిన వాతావరణం ఉండే అవకాశం ఉంది. వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇప్పటివరకు భారత్, ఇంగ్లాండ్ జట్లు మొత్తం 112 వన్డేల్లో తలపడ్డాయి. అందులో భారత్ 63 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, ఇంగ్లాండ్ 44 మ్యాచ్‌ల్లో గెలిచింది. రెండు మ్యాచ్‌లు టై కాగా, మూడు మ్యాచ్‌లు ఫలితం తేలలేదు. ఈ గణాంకాలు భారత్‌కే స్వల్ప ఆధిక్యాన్ని చూపిస్తున్నాయి. నేడు మ్యాచ్ సాయంత్రం 5:30 గంటలకు మొదలవుతుంది.

**ప్లేయింగ్ XI (అంచనా):**

**భారత్ ప్లేయింగ్ XI:**
రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ.

**ఇంగ్లాండ్ ప్లేయింగ్ XI:**
జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), విల్ జాక్స్, లియామ్ డాసన్, గస్ అట్కిన్సన్/సామ్ కరన్, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, ఆదిల్ రషీద్.



# క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లిన భారత షట్లర్

భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ.. క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూ(చైనా)పై సింధు ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం పదో ర్యాంక్‌లో ఉన్న సింధు.. కేవలం 35 నిమిషాల్లోనే 21–16, 21–14 స్కోరుతో వరుస గేమ్‌ల్లో గెలిచి ప్రత్యర్థిపై సత్తాచాటింది. తొలి గేమ్‌లో ఆరంభంలో కాస్త వెనుకబడినప్పటికీ, మళ్లీ లయ అందుకుంది. ఆ తర్వాత వరుస పాయింట్లు సాధిస్తూ ఆధిపత్యం చెలాయించింది. ఇక.. రెండో గేమ్‌లో అయితే ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా రెచ్చిపోయిన భారత స్టార్ షట్లర్ 8–0 ఆధిక్యంతో మ్యాచ్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుని అలవోక విజయం సాధించింది. ఈ విజయంతో హాన్ యూపై సింధు తన హెడ్ టూ హెడ్ రికార్డును 8–1కు మెరుగుపరుచుకుంది. ఈ సీజన్‌లో సింధు నమోదు చేసిన అత్యుత్తమ విజయాల్లో ఇదొకటిగా నిలిచింది. ఇక.. క్వార్టర్ ఫైనల్లో సింధు జపాన్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమీ ఒకుహారాతో తలపడనుంది. టాప్ క్రీడాకారిణి ఆన్ సె–యంగ్(దక్షిణ కొరియా) గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో ఒకుహారాకు వాకోవర్ లభించింది. ప్రస్తుతం.. టోర్నీలో మిగిలిన ఏకైక భారత ప్లేయర్ సింధు కావడంతో అభిమానుల ఆశలన్నీ ఆమెపైనే ఉన్నాయి.

# బిజినెస్




# ఐటీ షేర్లపై ఆసక్తి..

గత రెండ్రోజులుగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న ఐటీ రంగ షేర్లు కోలుకున్నాయి. విలువలు ఆకర్షణీయంగా ఉండడంతో ఐటీ రంగ షేర్లపై మదుపర్లు ఆసక్తి చూపుతున్నారు. అలాగే జూన్ త్రైమాసికానికి సంబంధించిన ఫలితాలు వెల్లడవుతుండడం కూడా మదుపర్ల ఆసక్తికి కారణంగా నిలుస్తోంది. ఇక, అమెరికా ఫ్యూచర్స్ లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 96.30గా ఉంది. బ్యాంకింగ్ రంగం మాత్రం నష్టాల్లో ఉంది. గత సెషన్ ముగింపు (77,185)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 200 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కూడా స్థిరంగా కొనసాగుతోంది. ఉదయం 9:45 గంటల సమయంలో సెన్సెక్స్ 224 పాయింట్ల లాభంతో 77,409 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 52 పాయింట్ల లాభంతో 24,131 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో డిక్సన్ టెక్నాలజీస్, ఎస్ఆర్ఎఫ్, హిందూ పెట్రో, బీపీసీఎల్, కేన్స్ టెక్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఐసీఐసీఐ లాంబార్డ్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, పీబీ ఫిన్‌టెక్, వెర్సోవా టీడీ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 76 పాయింట్ల నష్టంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 138 పాయింట్ల నష్టంతో ఉంది.

# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఎల్పీజీ సిలిండర్లు




దేశీయంగా క్విక్ కామర్స్ సేవలు మరో కీలక దశలోకి అడుగుపెట్టాయి. ప్రభుత్వ రంగ మహారత్న సంస్థ హెచ్‌పీసీఎల్‌తో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ భాగస్వామ్యం కుదుర్చుకుని, దేశంలోనే తొలిసారిగా ఆన్–డిమాండ్ ఎల్‌పీజీ సిలిండర్ డెలివరీ సేవలను బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించింది. బుధవారం నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ సేవల ద్వారా వినియోగదారులు ఇన్‌స్టామార్ట్ యాప్‌లోనే హెచ్‌పీసీఎల్ కొత్త 10 కేజీల 'హెచ్‌పీ నవ్య' కాంపోజిట్ సిలిండర్‌తో పాటు 5 కేజీల మెటల్ సిలిండర్‌ను కూడా ఆర్డర్ చేసుకోవచ్చు. ముఖ్యంగా, అపార్ట్‌మెంట్‌లలో నివశించే చిన్న కుటుంబాలు, ఉద్యోగస్థులు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీన్ని తీసుకొచ్చారు. తేలికగా, తుప్పు పట్టకుండా ఉండే 'హెచ్‌పీ నవ్య' సిలిండర్‌లో ట్రాన్స్‌పరెంట్ బాడీ ఉండటంతో గ్యాస్ నిల్వను సులభంగా తెలుసుకోవచ్చు. గ్యాస్ కనెక్షన్ లేకపోయినా మొదటిసారి కొత్త సిలిండర్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉండగా, తర్వాతి ఆర్డర్లు రీఫిల్‌గా పరిగణించి ఖాళీ సిలిండర్‌ను తీసుకుని కొత్తది అందజేస్తారు. అన్ని డెలివరీలను హెచ్‌పీసీఎల్ అధీకృత డీలర్లు, శిక్షణ పొందిన సిబ్బంది భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తారు. ఈ భాగస్వామ్యంతో కిరాణా వస్తువులకే పరిమితమైన క్విక్ కామర్స్ ఇప్పుడు గృహ అవసరాల వంటి కీలక యుటిలిటీ సేవల్లోకి కూడా విస్తరిస్తోందని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా పేర్కొన్నారు.




# కేంద్రం కీలక నిర్ణయం..

అమెరికా, ఇరాన్ యుద్ధ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మరోసారి ఆందోళనలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రభావంతో ముడి చమురు (గ్లోబల్ క్రూడాయిల్) ధరలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ చమురు కంపెనీల ఎగుమతులపై నియంత్రణ విధించేందుకు గానూ డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF – విమాన ఇంధనం) ఎగుమతులపై విధించే అదనపు పన్నును ఏకంగా రూ. 7 మేర పెంచింది. దీనితో ఇప్పటివరకు లీటర్‌పై రూ. 8.5 గా ఉన్న పన్ను ఒక్కసారిగా రూ. 15.5 కి చేరింది. అయితే, పెట్రోల్ ఎగుమతులపై విధిస్తున్న పన్నును మాత్రం లీటర్‌కు రూ. 4 నుంచి రూ. 2.5 కి తగ్గిస్తూ సామాన్యులకు కొంత ఊరటనిచ్చింది. ఈ సవరించిన కొత్త రేట్లు నేటి నుంచే అమల్లోకి వస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్న తరుణంలో, దేశీయ రిఫైనరీలు స్థానిక మార్కెట్లను వదిలి విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేయడం ద్వారా భారీ లాభాలు గడించకుండా నిరోధించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై పన్నులు పెంచినప్పటికీ, దేశీయంగా ఇంధన లభ్యతను పెంచడమే దీని ప్రధాన ఉద్దేశం. అయినప్పటికీ, గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు నిరంతరం పెరుగుతూనే ఉండటంతో రాబోయే రోజుల్లో దేశీయ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు పెరగొచ్చనే ఆందోళనలు సామాన్య వినియోగదారుల్లో వ్యక్తమవుతున్నాయి.

# రూ.62,500 కోట్ల మొబైల్ పీఎల్ఐ 2.0కు కేబినెట్ ఆమోదం




కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రూ. 1.27 లక్షల కోట్లతో 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)' రెండో దశకు, అలాగే రూ. 62,500 కోట్లతో కొత్త 'మొబైల్ ఫోన్ తయారీ పథకం (ఎంపీఎంఎస్)'కు ఆమోదం తెలిపింది. ఐఎస్ఎం రెండో దశలో దేశీయంగా చిప్ డిజైన్, తయారీ, ప్యాకేజింగ్‌తో పాటు పరికరాలు, రసాయనాలు, ముడి పదార్థాల తయారీకి కూడా ప్రభుత్వం మద్దతు ఇవ్వనుంది. చిప్ డిజైన్ సంస్థలకు గ్రాంట్లు, ఈక్విటీ పెట్టుబడులు అందించడంతో పాటు, సరఫరా గొలుసులోని తయారీ యూనిట్లకు 30 శాతం ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఇప్పటికే ఐఎస్ఎం కింద ఆమోదించిన 12 చిప్ తయారీ, ప్యాకేజింగ్ ప్రాజెక్టుల్లో మూడు వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ దశలో మొత్తం రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు, రూ. 2 లక్షల కోట్ల ఉత్పత్తి, రూ. 1 లక్ష కోట్ల ఎగుమతులు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, 2026లో ముగిసిన పీఎల్ఐ పథకానికి బదులుగా తీసుకొచ్చిన ఎంపీఎంఎస్ భారత్‌ను కేవలం మొబైల్ అసెంబ్లీ కేంద్రంగా కాకుండా, సొంత బ్రాండ్లు, స్వదేశీ టెక్నాలజీ, పేటెంట్లతో కూడిన గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంపై దృష్టి పెట్టింది. ఈ పథకం 2026–27 నుంచి ఐదేళ్ల పాటు అమలులో ఉంటుంది. ప్రస్తుతం చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా ఉన్న భారత్‌లో, 2024–25లో మొబైల్ ఉత్పత్తి విలువ రూ. 5.5 లక్షల కోట్లకు, స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రూ. 2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2025లో స్మార్ట్‌ఫోన్లు దేశంలోనే అత్యధిక విలువైన ఎగుమతి ఉత్పత్తిగా నిలిచాయి. కొత్త పథకం ద్వారా మొత్తం స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తి విలువను సుమారు రూ. 39 లక్షల కోట్లకు పెంచడం, ఎగుమతులను మరింత విస్తరించడం, ముఖ్యంగా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 60 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించాలని ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీంతో భారత్ ప్రపంచానికి ఫోన్లు అసెంబుల్ చేసే దేశం నుంచి, వాటిని డిజైన్ చేసి, పేటెంట్ పొంది, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే టెక్నాలజీ కేంద్రంగా మారాలని కేంద్రం భావిస్తోంది.




# మరోసారి అదే తప్పు




సినిమా ఇండస్ట్రీలో ఒక స్థాయికి చేరుకున్న తర్వాత ఏ సినిమా చేయాలనే దానికంటే, ఏ సినిమాను వదులుకోవాలనే నిర్ణయం కూడా చాలా కీలకమని సినీ విశ్లేషకులు తరచూ చెబుతుంటారు. సరైన నిర్ణయాలు తీసుకున్న హీరోయిన్లే ఎక్కువ కాలం స్టార్‌డమ్‌ను కొనసాగించగలరని వారి అభిప్రాయం. ఈ నేపథ్యంలో శ్రీలీల తీసుకున్న కొన్ని నిర్ణయాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించిన శ్రీలీలకు భారీ విజయాలు తక్కువే అయినప్పటికీ, ఆమెకు ఉన్న క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. కొంతకాలం క్రితం అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' చిత్రంలో మొదట శ్రీలీలనే హీరోయిన్‌గా ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదలైంది. అయితే డేట్స్ సర్దుబాటు చేయలేక ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. అనంతరం భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా ఎంపికైంది. ఇటీవల విడుదలైన 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, శ్రీలీల ఆ సినిమాను వదులుకోవడం పెద్ద తప్పిదమని సోషల్ మీడియాలో పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ సినిమా చేసి ఉంటే ఆమె ఖాతాలో మరో భారీ విజయం చేరేదని అభిమానులు భావిస్తున్నారు. ఇదే సమయంలో శ్రీలీల మరో అవకాశాన్ని కూడా వదులుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అజిత్ కుమార్ హీరోగా రూపొందుతున్న ఓ చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా తీసుకోవాలని భావించారని, అయితే డేట్స్ సమస్య కారణంగా ఆ ప్రాజెక్ట్‌ను కూడా వదులుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆమె స్థానంలో కయాదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ వార్తల నేపథ్యంలో మరోసారి శ్రీలీల నిర్ణయాలపై అభిమానులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలే



# సైలెంట్ స్టేట్‌మెంట్

అక్కినేని అఖిల్ తాజాగా నటించిన చిత్రం 'లెనిన్'. ఇందులో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. జూలై 10న విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం 'లెనిన్ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్' పేరుతో విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అఖిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అఖిల్ మాట్లాడుతూ.. నా కెరీర్‌లోనే 'లెనిన్' అతి పెద్ద విజయం. ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా విజయం సాధించిందని నేను కాలర్ ఎగరేయడం లేదు.. గట్టిగా అరవడం లేదు. నేను ఎప్పటిలాగే సైలెంట్‌గా నా పని చేసుకుంటూ ముందుకు వెళ్తాను. ఇకపై కూడా ఇలాంటి మంచి విజయాలు అందించేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే "జూనియర్ ఎన్టీఆర్ గారికి ఒక్క ఫోన్ చేయగానే మా సినిమా కోసం వాయిస్ ఓవర్ చెప్పడానికి వెంటనే అంగీకరించారు. ఆయన వాయిస్‌తో సినిమా ఎంతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ప్రేక్షకులను మొదటి నుంచే కథలోకి తీసుకెళ్లడంలో ఆయన వాయిస్ ఓవర్ కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా విజయంలో ఎన్టీఆర్ గారి సహకారం కూడా ఎంతో ముఖ్యమైనది" అని అఖిల్ పేర్కొన్నారు. ప్రస్తుతం అఖిల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# పీరియాడికల్ యాక్షన్ డ్రామా..



1950-60 మధ్య కాలంలో కేరళలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా అద్భుతంగా రూపొందించారు. 1957లో కేరళలో కమ్యూనిస్ట్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఆ మరుసటి సంవత్సరమే అంటే 1958లో ప్రభుత్వం చారిత్రాత్మకమైన 'భూ సంస్కరణల బిల్లు'ను అమల్లోకి తెస్తుంది. ఈ బిల్లు కారణంగా గ్రామాల్లో ఉండే భూస్వాములు, వలసదారుల నుంచి ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత మొదలవుతుంది. ఈ గొడవల నేపథ్యంలో తమ చర్చిలను, ఆస్తులను కాపాడుకునేందుకు మత పెద్దలు ప్రత్యేక రక్షణ దళాలను తయారు చేసుకోవడం ప్రారంభిస్తారు. ఈ క్రమంలోనే పోతన్ క్రిస్టోఫర్ అనే యువకుడిని చర్చి రక్షకుడిగా నియమిస్తారు. అయితే ఇక్కడే ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉంది. చర్చి రక్షకుడిగా మారిన అతని అసలు పేరు కృష్ణ పిళ్లై. అసలు ఒక హిందూ యువకుడైన కృష్ణ పిళ్లై, మారుపేరుతో చర్చిలోకి ఎందుకు అడుగుపెట్టాడు? తన అసలు గుర్తింపును ఎందుకు దాచాల్సి వచ్చింది? మరోవైపు తీవ్రమైన కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న రెబెక్కాతో అతని ప్రేమాయణం ఎలా సాగింది? చివరకు చర్చి గొడవల్లో అతను ఎలాంటి పాత్ర పోషించాడు? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా సాగుతుంది.




# 'ది ప్యారడైజ్'కు సూపర్ ఆఫర్



ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఒకవైపు సినిమాలను నిర్మిస్తూనే, మరోవైపు భారీ చిత్రాల పంపిణీ హక్కులను సొంతం చేసుకుంటూ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేస్తున్నారు. దీంతో ఆయన తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజా సమాచారం ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఓ క్రేజీ సినిమా థియేట్రికల్ హక్కుల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా మరేదో కాదు.. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'. ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్‌ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చేరుకురి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. అందుకోసం షూటింగ్‌ను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా థియేట్రికల్ హక్కులను దక్కించుకునేందుకు దిల్ రాజు భారీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగా నిర్మాతలకు ఆకర్షణీయమైన ఆఫర్ కూడా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే చివరికి 'ది ప్యారడైజ్' థియేట్రికల్ హక్కులు దిల్ రాజు సొంతమవుతాయా? లేదా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది.

# భయపెట్టడానికి రెడీ అయిన తమన్నా..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ఓ వైపు వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తూ.. ఐటమ్ సాంగ్స్ చేస్తూ ఇండస్ట్రీని షేక్ చేస్తున్నారు. అంతేకాకుండా తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఇటీవల ఆమె 'ఓ రొమియో' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు.. కానీ హిట్ అందుకోలేకపోయారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా.. బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం 'ది వ్యాన్' చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకోగా.. తాజాగా, తమన్నా మరో భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇన్నాళ్లు ప్రేమకథల్లో తనదైన నటనతో మెప్పించిన ఆమె.. రూట్ మార్చి హారర్ కథలను ఎంచుకుంటూ భయపెట్టేందుకు సిద్ధమయ్యారు. బాలీవుడ్ ఫేమస్ హారర్ థ్రిల్లర్ సిరీస్ 'రాగిణి' ఫ్రాంచైజీలో రాబోతున్న మూడో భాగం 'రాగిణి 3'లో తమన్నా మెయిన్ లీడ్‌గా జాయిన్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ ఈరోజే అధికారికంగా ప్రారంభమైంది. ఈ విషయాన్ని తమన్నా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో Day 01 అని ఉన్న క్లాప్‌బోర్డ్‌ను పట్టుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. మునుపటి భాగాల కంటే సరికొత్త కథతో, క్రియేటివ్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ హారర్ మిస్టరీలో తమన్నాతో పాటు ఆయుష్ శర్మ, ఆమిర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు శశాంక ఘోష్ దర్శకత్వం వహిస్తుండగా, బాలాజీ మోషన్ పిక్చర్స్, టిప్స్ ఫిల్మ్స్, జై హో మీడియా వెంచర్స్ సంస్థలు కలిసి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఏక్తా కపూర్, శోభా కపూర్, అమర్ బుటాలా, కుమార్ తౌరానీ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. కంప్లీట్ హారర్ అండ్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ సినిమాపై అప్పుడే బాలీవుడ్‌లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది.



# దర్శకుడిగా నా ప్రయాణం అక్కడే మొదలైంది..



సందీప్‌కు ఈ కథ, అందులోని క్యారెక్టరైజేషన్, స్క్రీన్‌ప్లే బాగా నచ్చడంతో కథ విన్న వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. సాధారణంగా చిన్న వయసులోనే డైరెక్టర్ అవుతుండటంతో అందరూ తన నుండి ఒక రొమాంటిక్ లవ్ స్టోరీ ఆశించారని, కానీ తనకు ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే ప్రేమకథ కంటే ఒక గ్యాంగ్ నేపథ్యంలో నడిచే సాహసోపేతమైన దొంగతనం సినిమా తీయడమే ఎక్కువ ఇష్టమని స్పష్టం చేశారు. అలాగే తన నటన గురించి వస్తున్న వార్తలపై స్పందిస్తూ, ఈ 'సిగ్మా' సినిమా విడుదల తర్వాతే యాక్టింగ్ గురించి ఆలోచిస్తానని క్లారిటీ ఇచ్చారు. ఇక ఇంత చిన్న వయసులోనే దర్శకుడిగా మారాలనే కల ఎలా మొదలైందనే ప్రశ్నపై సంజయ్ స్పందిస్తూ.. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సినీ నేపథ్యం ఉన్న ఫ్యామిలీ నుండి రావడం వల్ల చిన్నప్పటి నుంచే షూటింగ్ స్పాట్‌లకు వెళ్లడం, ప్రీమియర్ షోలు చూడటం తనకు అలవాటయిందని చెప్పారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల సినిమాలు చూసే అవకాశం ఉందని, తాను ఏ మూవీ చూసినా కథను చెప్పే విధానాన్ని, అది ఎలా మొదలై ఎలా సాగుతుందనే విషయాలను ఒక ఆటలా గమనించేవాడినని అన్నారు. సినిమా చూసిన ప్రతిసారీ తన స్నేహితుల దగ్గరకు వెళ్లి ఎంతో ఉత్సాహంగా ఆ కథలను వివరించేవాడినని, వెనక్కి తిరిగి చూసుకుంటే ఒక కథకుడిగా తన ప్రయాణం నిజానికి అక్కడే మొదలైందని సంజయ్ ఎమోషనల్ అయ్యారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**